# ఉల్లి రూ.70.. వెల్లుల్లి రూ.400





**మండవల్లి, న్యూస్‌టుడే:** ఉల్లి, వెల్లుల్లి ధరలు ఆకాశాన్ని అంటుతూ వినియోగదారుల కళ్లలో నీళ్లను రప్పిస్తున్నాయి. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో ఉల్లి కిలో రూ.70కు చేరింది. దీనికి వెల్లుల్లి తోడైంది. కిలో రూ.400 పలుకుతోంది.

| ధర కిలో (రూ.లలో) | ఉల్లి | | వెల్లుల్లి | |
|---|---|---|---|---|
| | ప్రస్తుత ధరలు | 4 నెల కిందట | ప్రస్తుత ధరలు | 4 నెల కిందట |
| రైతు బజార్ | 65 | 20 | 360 | 200 |
| టోకున అమ్మకాలు | 60 | 25 | 350 | 220 |
| బయట మార్కెట్ | 70 | 28 | 400 | 320 |

**రెండు నెలలుగా పెరుగుతూనే..** రెండు నెలలుగా ఉల్లి ధర వినియోగదారుల్లో గుబులు రేపుతోంది. ఆగస్టులో రూ.50, సెప్టెంబరులో రూ.60, అక్టోబరులో రూ.70 మార్కును చేరుకున్నాయి. ధరల పెరుగుదలతో కేజీ కొనాల్సిన వారు అర కిలోతోనే సరిపెట్టుకుంటున్నారు. మార్కెట్లో రెండు రకాల ఉల్లిపాయలు లభిస్తున్నాయి. రెండో రకం ఉల్లినే రైతు బజారులో రూ.60లకు అమ్ముతున్నారు.

## త్వరితగతిన భూ సేకరణ పూర్తి: కలెక్టర్



మాట్లాడుతున్న వెట్రిసెల్వి

**ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే:** జిల్లాలో భూ సేకరణ నివేదికను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కార్యాలయం నుంచి భూ సేకరణపై జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో గురువారం వీక్షణ సమావేశం నిర్వహించి మాట్లాడారు. మధ్య ఆదాయం గ్రూప్ హౌసింగ్, జంగారెడ్డిగూడెంలో పామాయిల్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, జీలుగుమిల్లిలో నౌకాదళ విభాగం, నూజివీడు నుంచి సుంకొల్లు రింగ్‌రోడ్డు, పరిహార అటవీ నిర్మాలన బ్లాక్స్, జాతీయ రహదారులకు భూ సేకరణ చేపట్టాలన్నారు. కోర్టు కేసులు, తాడిపూడి లిఫ్టు ఇరిగేషన్, చింతలపూడి మండలంలో రేచర్లలో నేరుగా కొనుగోలు కింద బెల్‌మౌత్‌లకు అదనపు విస్తరణ, బీఎస్ఎన్ఎల్ స్ట్రక్చర్‌కు భూములు సేకరించాలన్నారు. మోడల్ పార్కుకు, ఏపీ ట్రాన్స్‌కో, పవర్‌గ్రిడ్ ఎలక్ట్రికల్ టవర్లు, పరిశ్రమలు, ఏపీసీఆర్డీఏ, మత్స్యశాఖలకు భూ కేటాయింపుపై కలెక్టర్ సమీక్షించారు.



**శివంకరి.. శుభంకరి**

దసరా నవరాత్రుల్లో భాగంగా గురువారం గాజులపేట గంగానమ్మను దుర్గాదేవిగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. - న్యూస్‌టుడే, ఏలూరు నగరం



**మేఘం కమ్మేసి...**

ఏలూరు గ్రామీణ మండలం మహేశ్వరపురంలో మధ్యాహ్నం దట్టమైన మేఘాలు కమ్ముకున్నాయి. ఓవైపు వర్షం కురుస్తుండగా- మరోవైపు ఎండకాస్తూ కాసేపు దోబూచులాడాయి. ఈ దృశ్యం స్థానికులను కనువిందు చేసింది. - ఈనాడు, ఏలూరు

## బాధితులకు ఉచిత న్యాయ సాయం

**ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే:** బాధితులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని సంస్థ జిల్లా కార్యదర్శి రత్నప్రసాద్ అన్నారు. తంగెళ్లమూడిలోని మిషనరీ ఆఫ్ చారిటీస్ నిర్వహిస్తున్న హోంను గురువారం పరిశీలించారు. అక్కడి ఆశ్రయం పొందుతున్న వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు పొందడంలో ఏవైనా సమస్యలుంటే తమవంతు సహాయం అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

# ప్రకృతి సాగు.. ఇదీ మేలు!

☛ పరిశీలించిన నీతి ఆయోగ్ బృందం ☛ జిల్లాలో సుడిగాలి పర్యటన



కషాయాలు పరిశీలిస్తున్న రమేష్ చంద్ బృందం

**ఏలూరు (గ్రామీణ), న్యూస్‌టుడే:** నీతి ఆయోగ్(వ్యవసాయం) బృందం జిల్లాలో సుడిగాలి పర్యటన చేసింది. ఆదాయ డాక్టర్ రమేశ్ చంద్ నేతృత్వంలో ఎనిమిది మంది సభ్యులు గురువారం ఏలూరు గ్రామీణ మండలం వెంకటాపురంలో పర్యటించారు. అక్కడి ప్రకృతి వ్యవసాయ విధానాన్ని పరిశీలించారు. గ్రామానికి చెందిన తలారి జ్యోతి, నాగమణి, జయరాజు పొలాల్లో సేద్య విధానంలో అనుసరిస్తున్న వరి కాంపోస్టు బ్లాక్‌లను సందర్శించారు. 10 మంది రైతులు 16 ఎకరాల విస్తీర్ణంలో ఎలాంటి రసాయనాలు వాడకుండా పంటలు పండించిన విధానాన్ని తెలుసుకున్నారు. సంప్రదాయ రసాయన, ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల వ్యత్యాసాలపై ఆరా తీశారు. వరిలో అంతర పంటలు సాగు చేయడం ద్వారా రైతులు అధిక ఆదాయం ఆర్జిస్తున్నట్లు గమనించారు. గ్రామంలోని మహిళా సంఘాల ప్రతినిధులతో చర్చించారు. సేంద్రియ ఉత్పత్తుల విక్రయాలకు ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం వట్లూరులోని టీటీడీసీ భవనంలో బృంద సభ్యులు రైతులతో సమావేశమయ్యారు. ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకించారు. కార్యనిర్వాహక సంచాలకులు శామ్యూల్ ఆనంద్, సీనియర్ కన్సల్టెంట్ డి.వి.రాయుడు, ప్రసాద్, సీనియర్ మాటెక్ లీడ్ గోపీచంద్, డాక్టర్ జాకీర్ హుస్సేన్, డీపీఎం తాతారావు, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా, ఏడీఏ సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యం అంతంత మాత్రం..!

**ఈనాడు, ఏలూరు, న్యూస్‌టుడే, జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం, చింతలపూడి, జీలుగుమిల్లి, నూజివీడు పట్టణం:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మందు బిళ్లలు సవ్యంగా అందటం లేదు. వైద్యులు చీటీలో రాసిన మందుల సంఖ్యకు..రోగులకు ఇస్తున్న మందులకు పొంతన ఉండటం లేదు. కొందరు వైద్యులు బయట మందుల దుకాణాల నిర్వాహకులతో కుమ్మక్కై దందా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

“చర్మ సంబంధమైన సమస్యతో ఆసుపత్రికి వచ్చాను. ఆసుపత్రిలో మందులు అందుబాటులో లేకపోవడంతో స్థానికంగా ఉన్న జనరిక్ దుకాణంలో కొనుగోలు చేశా. రూ. 300 ఖర్చయింది.” అని లింగపాలెం మండలం పుప్పాలవారిగూడెంకు చెందిన బాల శివరామయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

“నా భర్త అస్వస్థతకు గురయ్యారు. ఆసుపత్రి ఔషధ కేంద్రంలో మాత్రలు లేకపోవడంతో రూ. 450 వెచ్చించి బయట కొనుగోలు చేశాం.” అని జంగారెడ్డిగూడెనికి చెందిన దుర్గ దంపతులు ఆందోళన వ్యక్తం చేశారు.



“రోడ్డు ప్రమాదంలో గాయపడ్డా. గురువారం ఏలూరు జిల్లా ఆసుపత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నా. వైద్యుడు 15 రోజులకు మందులు రాసిస్తే..ఔషధ కేంద్రంలో 10 రోజులకు సరిపడా మాత్రమే ఇచ్చారు. అడిగితే మళ్లీ రమ్మన్నారు” అని పెదవేగి మండలం బాపిరాజుగూడెంకు చెందిన మద్దాల వెంకటేశ్వరరావు వాపోయారు.

**బయట కొనాల్సిందే**

ఆసుపత్రుల్లో మందుల కొరత ఉంది. గ్యాస్ మందులు, చర్మ వ్యాధుల మందులు అందుబాటులో లేవు. గర్భిణులకు ప్రసవ సమయంలో వినియోగించే ఇంజెక్షన్లు సైతం అందుబాటులో లేకపోవడం గమనార్హం. బుట్టాయగూడెం, చింతలపూడి ఏరియా, ఏలూరు జిల్లా ఆసుపత్రుల్లో వైరల్ ఫీవర్‌లకు వినియోగించే ఎమాక్సిసిలిన్‌తో పాటు చర్మ సంబంధ వ్యాధుల మందులు లేవు. చాలా చోట్ల మలేరియా చికిత్సకు అవసరమైన ఆర్టిసినేట్ ఇంజెక్షన్ గత ఆరు నెలలుగా సరఫరా కావడం లేదు.

**పరిశీలన**



చింతలపూడి జనరిక్ దుకాణంలో మందులు కొనుగోలు చేస్తున్న రోగులు

**సగం ఇచ్చి.. తర్వాత రమ్మంటూ**

చాలా సర్కారు వైద్యాలయాల్లో వైద్యులు రాసిన పూర్తి మందులు ఇవ్వటం లేదు. సగం ఇచ్చి మళ్లీ రమ్మని సూచిస్తున్నారు. దీంతో రోగులు ప్రయాణ ఖర్చులకు భయపడి రావడం లేదు. మధుమేహం రోగులకు నెలకు 30 మాత్రలు మాత్రమే ఇస్తున్నారు.

**కమీషన్ల కోసం**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు కమీషన్లకు కక్కుర్తి చూపిస్తున్నారు. ఆసుపత్రుల బయటే ప్రైవేటు దుకాణాలు ఏర్పాటు చేయిస్తున్నారు. నిర్వాహకులతో ఒప్పందం కుదుర్చుకుని అందుబాటులో లేని మందులతో పాటు అవసరం లేనివి కూడా రాసి అక్కడే కొనుగోలు చేయాలని చెబుతున్నారు. భారీగా కమీషన్లు తీసుకుంటున్నారు. నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో కొందరు వైద్యులు సమీపంలోనే ఓ వ్యక్తితో దుకాణం ఏర్పాటు చేయించారు. దీనిపై కలెక్టర్ వెట్రి సెల్వి మాట్లాడుతూ వైద్య సేవలపై సమీక్షించాం. అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు.



జిల్లా ఆసుపత్రి 1 | ప్రాంతీయ ఆసుపత్రులు 3 | ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 64

# గ్రామాల్లో జోరు.. మన్యంలో హోరు

## 4275కు చేరిన మద్యం దరఖాస్తులు



**ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** మద్యం దుకాణాలకు పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే పోటీ నెలకొంది. అక్కడే అధిక దరఖాస్తులు నమోదవుతున్నాయి. పట్టణాల్లో కొంత వెనుకబాటు కనిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 144 దుకాణాలుండగా గురువారం నాటికి 4,275 దరఖాస్తులందాయి. ఏలూరు నగరంలో 21 దుకాణాలకు 190 దరఖాస్తులే అందాయి. గ్రామీణ ప్రాంతాల్లో రెండు, మూడు దుకాణాలకే 100 నుంచి 150 వచ్చాయి. పట్టణ ప్రాంతాల్లో కొందరు సిండికేట్‌గా ఏర్పడటమూ ఇందుకు కారణం. మెట్ట ప్రాంతం చింతలపూడిలో దుకాణాలు పోటీ నెలకొంది. పట్టణంలోని రెండింటికి 89 దరఖాస్తులు అందగా గ్రామీణంలోని మూడింటికి 111 వచ్చాయి. కామవరపుకోటలో నాలుగింటికి 149, లింగపాలెంలో నాలుగింటికి 156 వచ్చాయి. ఇక భీమడోలు మండలంలోనూ పోటీ అధికంగా ఉంది. జిల్లాలోనే అత్యధికంగా ఏడింటికి 337 దరఖాస్తులందాయి.

| ఎక్సైజ్ స్టేషన్ | దుకాణాలు | దరఖాస్తులు |
|---|---|---|
| ఏలూరు | 41 | 343 |
| చింతలపూడి | 16 | 643 |
| భీమడోలు | 22 | 959 |
| పోలవరం | 12 | 498 |
| జంగారెడ్డిగూడెం | 16 | 818 |
| నూజివీడు | 16 | 559 |
| కైకలూరు | 21 | 455 |

# నిధులు కరుగుతున్నా.. శుభ్రత సున్నా!

## పట్టణాల్లో సమస్యగా మారిన పారిశుద్ధ్య నిర్వహణ



ట్రాక్టర్‌కు సంచులు కట్టి చెత్త తరలింపు

**జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** పుర, నగర పాలక సంస్థలకు వచ్చే ఆదాయంలో అధిక భాగం వ్యర్థాల నిర్వహణ, పారిశుద్ధ్య సిబ్బంది జీతాల కోసమే వెచ్చించాల్సి వస్తోంది. అయినప్పటికీ స్వచ్ఛత అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. గతంలో ఇంటింటి చెత్త సేకరణతో పాటు వీధులు, రహదారులు సైతం శుభ్రం చేసేవారు. ప్రస్తుతం చాలా పట్టణాల్లో వీధుల శుభ్రత, డ్రెయిన్లలో పూడిక తొలగింపు అటకెక్కింది. చెత్త సేకరించి డంపింగ్ యార్డులకు తరలించడంపైనే అధికారులు, పాలకులు శ్రద్ధ చూపుతున్నారు.

**జంగారెడ్డిగూడెం:** ఈ పురపాలక సంఘంలో సిబ్బంది కొరతతో పారిశుద్ధ్య నిర్వహణ కష్టంగా మారింది. ఇక్కడ 92 మంది ఉంటే 72 మంది మాత్రమే నిత్యం చెత్త తొలగించే పనులు చేసేది. 35 మంది కార్మికులను కేటాయించాలని గత వైకాపా ప్రభుత్వ హయాంలో పలుమార్లు పాలకవర్గం విజ్ఞప్తులు చేసినా ప్రయోజనం లేదు. క్లాప్‌లో ఇచ్చిన 9 ఈ-ఆటోలు మూలకు చేరాయి. రూ.10లక్షలు పెట్టి విండ్రోకంపోస్టింగ్ కేంద్రం నిర్మించారు. కానీ దీన్ని ఉపయోగించడం లేదు.

| పట్టణం | ఏలూరు | జంగారెడ్డిగూడెం | చింతలపూడి | నూజివీడు |
|---|---|---|---|---|
| రోజువారీ సేకరిస్తున్న వ్యర్థాలు టన్నుల్లో | 120 | 36 | 5 | 28 |
| పారిశుద్ధ్య కార్మికులు | 1,300 | 92 | 85 | 143 |
| నిర్వహణకు ఏడాది వ్యయం(రూ.కోట్లు) | 18 | 3 | 1.56 | 6.86 |
| ట్రీట్‌మెంట్ ప్లాంట్ల సంఖ్య | 1 | లేవు | 1 | 1 (పూర్తి కాలేదు) |

**ఏలూరు:** జిల్లా కేంద్రం ఏలూరులో చెత్త సేకరణ ఆశించిన స్థాయిలో లేదు. వందల మంది సిబ్బంది ఉన్నా పలు చోట్ల చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. వీటి కారణంగా కాలానుగణ వ్యాధులు ప్రబలుతున్నాయి. జ్వరాల కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. రాత్రి వేళల్లో కొన్ని రహదారులను శుభ్రపరుస్తున్నా. ఎక్కువ శాతం వదిలేస్తున్నారు.

# అడుగడుగునా ప్రతిబంధకాలు

బాలికలు.. ఆదిశక్తి రూపాలు.. భూమాత సహనానికి సాక్ష్యాలు.. చిగురించే మొక్కలు.. వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే ఏ రంగంలోనైనా రాణిస్తారు. కానీ ముక్కుపచ్చలారని చిన్నారులు మూడు ముళ్ల బంధంలో ఇరుక్కుంటున్నారు. కామాంధుల ఉచ్చుల్లో వారి భవిత సమిధవుతోంది. చివరకు చదువులోనూ వివక్షకు గురవుతున్నారు. - ఈనాడు, ఏలూరు

## ఆదిశక్తి రూపాలు..

**ఎందరో పుత్తడి బొమ్మలు..** ఉమ్మడి జిల్లాలో ప్రజల్లో చైతన్యం ఉన్నా గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల మొదలు పట్టణాల్లో సైతం బాల్య వివాహాలు జరుగుతున్నాయి. గత అయిదేళ్లలో 751 బాల్య వివాహాలను అధికారులు గుర్తించారు. గుట్టుచప్పుడు కాకుండా జరిగినవి వేలల్లో ఉంటాయి.

5-17 ఏళ్ల వయస్సు లోపు బాలికల వివరాలు

| వయస్సు | సంఖ్య |
|---|---|
| 0-5 | 1,97,927 |
| 5-10 | 1,22,156 |
| 10-15 | 1,39,022 |
| 15-17 | 44,480 |

**మధ్యలోనే చదువుకు స్వస్తి**


మూడేళ్ల కిందట ఉమ్మడి జిల్లాలో 28,014 మంది 8వ తరగతి విద్యార్థులున్నారు. వారు తొమ్మిదో తరగతికి వచ్చే సరికి ఆ సంఖ్య 26,120కు తగ్గింది. ఈ సంఖ్య ఇంటర్ పూర్తివచ్చే సరికి మరింత పడిపోతోంది. ఆర్థిక భారం, వివాహాలు చేయడం, ఇతర కారణాలతో ఇలా ఏటా చదువు మానేస్తున్న బాలికల శాతం తగ్గిపోతోంది.



**ఆగని బాల్య వివాహాలు, అత్యాచారాలు**

నేడు అంతర్జాతీయ బాలికల దినోత్సవం

**కామాంధుల చేతుల్లో విలవిల..** ఉమ్మడి జిల్లాలో గత రెండేళ్లుగా దాదాపు 30 మంది వరకు బాలికలపై అత్యాచారాలు జరిగాయి. ● ఏలూరు అమీనాపేటలోని బాలికల వసతి గృహంలో యాజమాన్యానికి చెందిన ఓ వ్యక్తి బాలికలను లైంగికంగా వేధించడం కలకలం రేపింది. ● దెందులూరు మండలానికి చెందిన బాలికపై ఓ వ్యక్తి అయిదు నెలలుగా అత్యాచారం చేసి గర్భిణిని చేశారు. ● ఆకివీడు మండలం పెదకాపవరంలో ఇద్దరు స్నేహితులు ఓ బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారం చేశారు. ఇలాంటి అఘాయిత్యాలు తరచూ జరుగుతూనే ఉన్నాయి.





సంవత్సరాల వారీగా ఉమ్మడి జిల్లాలో గుర్తించిన బాల్య వివాహాలు



భీమవరం మండలంలో లోసరి పంట కాలువపై 2016లో రూ.7.31 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్తు ప్రాజెక్టు ఇది. ఈ తరహా ప్రాజెక్టుల్లో ఇది దేశంలో రెండోది. దక్షిణాది ఇదే తొలి ప్రాజెక్టు కావడం విశేషం. నిర్వహణ లేమితో ఏడాదిన్నర నుంచి ఈ ప్రాజెక్టు నిరుపయోగంగా మిగిలింది. ఈ కేంద్రం నిర్వహణ బాధ్యతను నెడ్‌క్యాప్ బీహెచ్ఈఎల్‌కు అప్పగించగా ఆ సంస్థ మరో ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించింది. కాలక్రమంలో దీని నిర్వహణను గాలికొదిలేశారు.

# ఏదీ అలనాటి సౌరభం?

నిరుపయోగంగా రూ.కోట్ల విలువైన ప్రాజెక్టు



వృథాగా ఖరీదైన యంత్రాలు



**భీమవరం అర్బన్, న్యూస్‌టుడే:** భీమవరం సమీపాన లోసరి పంటకాలువపై తొమ్మిదేళ్ల కిందట నిర్మించిన సౌర విద్యుత్తు కేంద్రం ద్వారా నిత్యం 3,500 యూనిట్లు ఉత్పత్తి చేసి సమీపాన ఉన్న గొల్లవానితిప్ప ఉపకేంద్రానికి సరఫరా చేసేవారు. దీని నిమిత్తం విద్యుత్తుశాఖ సొమ్ము చెల్లించేది. ఈ కేంద్రంలో బ్రేకర్‌లో సమస్య తలెత్తి ఏడాదిన్నరగా విద్యుత్తు ఉత్పత్తి నిలిచిపోయింది. అప్పటి నుంచి సమస్యను పరిష్కరించకుండా వదిలేసింది. దీంతో ఎంతో ఖరీదైన పరికరాలు మూలనపడ్డాయి. కాలువపై ఏర్పాటు చేసిన సౌరఫలకాలు దెబ్బతింటున్నాయి. కాలువకు ఇరువైపులా పొదలు పెరిగి ఫలకాలను కమ్మేశాయి. రక్షణ కంచె చాలా వరకు దెబ్బతింది. ఈ కేంద్రంలో ఉత్పత్తి మాట పక్కన పెడితే నిర్వహణకు ప్రతి నెలా 1000 నుంచి 2000 యూనిట్ల విద్యుత్తును బయటి నుంచి తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన దస్త్రాన్ని ఉన్నతాధికారులకు పంపినట్లు నెడ్‌క్యాప్ జిల్లా అభివృద్ధి అధికారి హరీశ్ తెలిపారు. ఇటీవల బీహెచ్ఈఎల్ ప్రతినిధులు వచ్చి పరిశీలించారని, త్వరలోనే ఈ కేంద్రాన్ని వినియోగంలోకి తెస్తామని పేర్కొన్నారు.

# ఏటికేడు..అదే గోడు!

## కొల్లేరు నీటి స్థిరీకరణ ఎప్పటికి?



పెద ఎడ్లగాడి వద్ద ఉద్ధృతంగా ప్రవహిస్తున్న కొల్లేరు(పాత చిత్రం)

**మండవల్లి, న్యూస్‌టుడే:** కొల్లేరుపై రెగ్యులేటర్‌తోనే ఇతర అన్ని సమస్యలకు పరిష్కారం లభించి పూర్వవైభవం సాధ్య పడుతుందని కొల్లేరువాసుల ఆకాంక్ష. కాని ఏటికేడు ఈ నిర్మాణంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. వైకాపా పాలనలో రూ.468 కోట్లతో టెండర్లు పిలిచినా ఒక్క గుత్తేదారు కూడా ముందుకు రాలేదు. 8 ఏళ్ల క్రితం అంచనాలు సిద్ధం చేయడం, ప్రస్తుతం నిర్మాణ వ్యయం భారీగా పెరిగిపోవడంతో గుత్తేదారు చొరవ చూపలేదు. దీంతో అంచనాలన్నిటినీ వైకాపా ప్రభుత్వం రద్దు చేసింది.

కొల్లేరు-ఉప్పుటేరు మధ్యలో ఒకటి, ఉప్పుటేరు సముద్రముఖద్వారం వద్ద మరో రెగ్యులేటర్ నిర్మించాలని 2016లో అప్పటి తెదేపా ప్రభుత్వం యోచించింది. అప్పటి పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల అధికారులు పెద్దఎత్తున సర్వేలు చేసి అంచనాలను సిద్ధం చేసే సరికి 2019లో వైకాపా ప్రభుత్వం గద్దెనెక్కింది.. నాలుగేళ్ల తాత్సారం తర్వాత వైకాపా టెండర్లును పిలిచినా అప్పటికే రాష్ట్రంలోని చాలా ప్రాంతాలలో చేసిన పనులకు ప్రభుత్వం బిల్లులు సరిగ్గా చెల్లించకపోవడంతో గుత్తేదారులు ముందుకు రాలేదని వాదనలు వినిపించాయి.

**నష్టపోతున్న అరుదైన జాతులు..** ఏటా వర్షాకాలంలో భారీ ఎత్తున నీరు వస్తున్నా..మూణ్నాళ్ల ముచ్చటగానే మారుతోంది. ఎంత వరద వచ్చినా ఏకధాటిగా ఉప్పుటేరు ద్వారా సముద్రంలో చేరిపోతోంది. ఆగస్టు, సెప్టెంబరులో వచ్చే వరద నీరు డిసెంబర్, జనవరి వరకు మాత్రమే ఉంటుంది. ఈలోపే సరస్సులో నీరు ఆవిరై అడుగంటిపోతోంది. దీంతో ఖండాలను దాటి వస్తున్నా అరుదైన జాతి పక్షులకు ఆహారం, అద్భుత నల్లజాతి చేపలకు ఆవాసం కరవవుతోంది. దీంతో స్థానికంగా కొల్లేరును నమ్ముకుని జీవిస్తున్న మత్స్యకారులు సైతం ఉపాధిలేక ఇతర రాష్ట్రాలకు వలసలు పోతున్నారు. గత అంచనాలను పక్కన పెట్టి ప్రస్తుత ధరలతో అంచనాలు సిద్ధం చేసి టెండర్లు పిలవాల్సి ఉంది. ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని కొల్లేరువాసులు కోరుకుంటున్నారు. అధికారులతో సమీక్షించి కొల్లేరు రెగ్యులేటర్ నిర్మాణం ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తెలిపారు.

# శిలాఫలకమే మిగిలింది.. రోడ్డేదీ?

మండవల్లి మండలం పెదయడ్లగాడి నుంచి పెనుమాకలంక, నందిగామలంక, ఇంగిలిపాకలంక మీదుగా మండవల్లి వెళ్లే రహదారిని అభివృద్ధి చేస్తామని వైకాపా ఇచ్చిన హామీ కొల్లేటిపాలైంది. రూ.780 లక్షల అంచనా వ్యయంతో గత ఫిబ్రవరి 27న పెనుమాకలంకలో శంకుస్థాపన చేసినా పనులు కార్యరూపం దాల్చక పోవడంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఇటీవల వరదలకు రహదారి మరింత అధ్వానంగా మారడంతో ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. - ఈనాడు, మండవల్లి



శిలాఫలకం చెంత గోతుల మయమైన రహదారి



పెనుమాకలంక నుంచి మండవల్లి వెళ్లే రోడ్డులో గోతులు

# గోదావరిలో స్వల్పంగా పెరిగిన నీటి మట్టం

**పోలవరం, న్యూస్‌టుడే:** నదీ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరిలో నీటి మట్టం స్వల్పంగా పెరిగింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద గురువారం సాయంత్రానికి నీటి మట్టం 27.10 మీటర్లకు చేరినట్లు జలవనరులశాఖ అధికారులు చెప్పారు. 48 గేట్ల ద్వారా 1.01 లక్షల క్యూసెక్కులు దిగువకు వెళుతున్నట్లు పేర్కొన్నారు.

## ప్రకృతి.. గజముఖాకృతి!



పాలకొల్లు, న్యూస్‌టుడే: ప్రకృతిని పరిశీలిస్తే ప్రతిదీ పరవశమే. చెట్లకు వేలాడే ఊడలు, అల్లుకునే పాదులు కొన్ని వేళ్ల వివిధ ఆకృతుల్లో దర్శనమిస్తుంటాయి. మార్టేరు-పాలకొల్లు ప్రధాన రహదారిలో జగన్నాథపురం దగ్గర ఒక చెట్టుకు అలాంటి అల్లుకున్న పాదు తును చూసే వైపైకి ఏనుగు ఆకారంలో కనిపిస్తుంది. అటుగా వెళ్తున్న వారికి ఈ గజముఖ ఆకృతి నిదనిస్తే గొడుగులా మారిన తరుణంలో 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది.

## క్రమబద్ధీకరణ పత్రాల అందజేత



ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ కార్యాలయంలో కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగంలో చేరిన పలువురు టైపిస్టులకు జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ గురువారం క్రమబద్ధీకరణ పత్రాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ... సీపీటీలో ఉత్తీర్ణత సాధించిన టైపిస్టులకు మొదటగా విధుల్లో చేరిన తేదీ నుంచి రెగ్యులర్ టైపిస్టులుగా నిర్ణయించి సిబ్బందికి ఉత్తర్వులు అందజేశామన్నారు. జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు తదితరులున్నారు.

## బాలికలు విజయాల ప్రతిబింబించేలా వేడుకలు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: బాలికలు వివిధ రంగాల్లో సాధించిన విజయాలు, పరిశోధనలు, అభివృద్ధిని ప్రతిబింబించేలా అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో బాలిక దినోత్సవ నిర్వహణ ఏర్పాట్లపై గురువారం సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ... వట్లూరులోని డీఆర్‌డీఏ శిక్షణ కేంద్రంలో జిల్లా స్థాయి కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. 'భవిష్యత్తుకు బాలిక గళం' నినాదంతో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గ్రామ, మండల, డివిజన్ స్థాయిలోనూ సదస్సులు, ఇతర కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఇందులో ప్రజా ప్రతినిధులను భాగస్వాములు చేయాలన్నారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరచిన 9 మంది బాలికలకు ప్రశంసాపత్రాలు ఇస్తామన్నారు. సంయుక్త కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి, ఐసీడీఎస్ పీడీ కె.పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, జడ్పీ సీఈవో సుబ్బారావు, డీసీపీవో సూర్యచక్రవేణి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ చంద్రబాబుతోనే సాధ్యం

### తణుకు చేరుకున్న ఎమ్మార్పీఎస్ కృతజ్ఞత యాత్ర

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు అన్నారు. మాదిగలకు అండగా నిలిచిన చంద్రబాబు ప్రభుత్వానికి కృతజ్ఞత తెలియజేస్తూ ఆంధ్రప్రదేశ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన కృతజ్ఞత యాత్ర గురువారం ఉదయం తణుకు చేరింది. ముందుగా స్థానిక అంబేడ్కర్ భవనంలో మాదిగ నాయకులతో వెంకటేశ్వరరావు సమావేశం నిర్వహించి కరత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ పార్కు వద్ద అంబేడ్కర్, జగ్జీవన్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

## ఆకాశమే హద్దుగా..!

### ఇష్టమైన రంగాల్లో రాణిస్తున్న బాలికలు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే

బాలికల్లో ఆసక్తిని గమనించి ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారనడానికి ఈ చిన్నారులే ఉదాహరణ. బాలికల ఉత్సాహానికి తల్లిదండ్రుల సహకారానికి గురువుల ప్రోత్సాహం తోడైంది. ఒక్కొక్కరు తమకిష్టమైన రంగాల్లో వివిధ స్థాయిల్లో రాణిస్తూ ప్రశంసలు, పురస్కారాలు అందుకుంటున్నారు. బాలలతో సమానంగా వీరైతే అంతకుమించి మిన్నగా ప్రోత్సహిస్తే ప్రావీణ్యం సాధిస్తారని నిరూపిస్తున్నారు.

#### ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని..



'ఉన్నత పాఠశాలలో చదువుతున్నప్పటి నుంచి వాలీబాల్ సాధన చేస్తున్నా. గతేడాది రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యా. ఈ ఏడాది అండర్-17లో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యా. వ్యవసాయ కూలీ కుటుంబం మాది. క్రీడల్లో బాగా సాధన చేసి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్నదే నా కోరిక' అని రాజవరం విద్యార్థిని వై.సుష్మ చెప్పారు.

#### ఆసనాలు.. అలవోకగా..



'కొయ్యలగూడెం జడ్పీ బాలికోన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నా. మాది మధ్య తరగతి కుటుంబం. చదువుతున్న పాఠశాలలోనే శిక్షణ పొందుతూ 40 వరకు యోగాసనాలు వేస్తా. పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ కనబరచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యా. క్రీడల్లో రాణించి వ్యాయామ ఉపాధ్యాయినిగా ఉద్యోగం సాధించాలన్నదే నా ఆకాంక్ష' అని ఎం.యామినీదేవి పేర్కొన్నారు.

#### నృత్యంలో భళా..



'ఆరో ఏట నుంచి కూచిపూడి నృత్యం నేర్చుకుంటున్నా. ప్రస్తుతం తొమ్మిదో తరగతి చదువుతున్నా. తండ్రి కొయ్యలగూడెంలో ఓ ప్రైవేటు కళాశాల అధ్యాపకుడు. రాష్ట్ర స్థాయిలో విజయవాడ, గుంటూరు, జాతీయస్థాయిలో మహారాష్ట్రలోని షిర్డీ, కేరళలో నిర్వహించిన నృత్య పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి ప్రశంసలు అందుకున్నా. ఇప్పటి వరకు వివిధ స్థాయిల్లో 23 వరకు ప్రదర్శనలతో జాతీయ స్థాయి పురస్కారాలు అందుకున్నా. విజయవాడ, వారణాసిల్లో జరిగిన గిన్నిస్ ప్రపంచ రికార్డు ప్రదర్శనల్లో పాల్గొని ధ్రువపత్రాలు సొంతం చేసుకున్నా. నృత్యంలో మరింత రాణించాలన్నదే నా ఆకాంక్ష' అని చల్లాలి రూపిక తెలిపారు.

#### విజయం వైపు పావులు కదుపుతూ..



'ఏడేళ్ల వయసులో చదరంగంపై ఆసక్తి కలిగింది. మాది జంగారెడ్డిగూడెం. తొమ్మిదో తరగతి చదువుతున్నా. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో 72 పోటీల్లో పాల్గొని బహుమతులు, పురస్కారాలు సొంతం చేసుకున్నా. ఏలూరు జిల్లా అండర్-17 బాలికల ఓపెన్ చెస్ ఛాంపియన్‌షిప్ 2024, ఆంధ్రప్రదేశ్ అండర్-13 బాలికల చెస్ ఛాంపియన్‌షిప్ 2023, ఏపీ స్టేట్ స్కూల్స్ వ్యక్తిగత చెస్ ఛాంపియన్‌షిప్-2023 అండర్-13, జిల్లా గ్రంథాలయ సంస్థ పోటీల్లో ప్రథమ స్థానం సాధించా. అంతర్జాతీయ క్లాసికల్ రేటింగ్ 1457, ర్యాపిడ్ రేటింగ్ 1463, బ్లిట్జ్ రేటింగ్ 1431 పాయింట్లు సాధించా. అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నదే నా లక్ష్యం'అని శ్రీమణికార్తిక తెలిపారు.

## రతన్ టాటా మృతి తీరని లోటు: ఎంపీ

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: పద్మ విభూషణ్, టాటా సన్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా మరణం దేశానికి తీరని లోటని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ అన్నారు. ఆయన అత్యంత ప్రతిభాశీలుడైన పారిశ్రామికవేత్త అని, నిబద్ధత, నిజాయతీ, విలువలకు నిలువెత్తు రూపమని కొనియాడారు. పారిశ్రామిక వేత్తలకు ఆదర్శంగా నిలిచారని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## టెట్‌కు 38 మంది గైర్హాజరు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరు సమీప సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాల కేంద్రంలో 'ఉపాధ్యాయ అర్హత పరీక్షల (టెట్)' కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు మొత్తం 370 మంది అభ్యర్థులకు 332 మంది హాజరయ్యారు. మిగతా 38 మంది గైర్హాజరయ్యారని డీఈవో ఎస్.అబ్రహం తెలిపారు.

## దివ్యాంగుల రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఎంపిక

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: దివ్యాంగుల క్రికెట్ రాష్ట్ర జట్టుకు ఆగిరిపల్లికి చెందిన బెజవాడ యశోద కృష్ణ అర్హత సాధించారు. ఈనెల 15 నుంచి 25 వరకు రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్‌లో రాష్ట్రం తరఫున ఆడనున్నట్లు తెలిపారు. ఆగిరిపల్లిలో గురువారం పలువురు నాయకులు అతనిని అభినందించారు.

## ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు వల?

### రూ.లక్షలు గుంజుతున్న ముఠా

పోలవరం, న్యూస్‌టుడే: మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో సూపర్‌వైజర్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఇప్పిస్తామంటూ పోలవరం తదితర మండలాలకు చెందిన ముఠా ఒకటి ఏజెన్సీ గ్రామాల్లోని నిరుద్యోగులపై వల వేసినట్లు తెలిసింది. సూపర్‌వైజరుతో పాటు సీనియర్ అసిస్టెంట్ పోస్టులకు రూ.3.50 లక్షలు, జూనియర్ అసిస్టెంట్ రూ.2.50 లక్షలు అవుతుందని, అడ్వాన్సుగా రూ.లక్ష ఇస్తే నియామక ఉత్తర్వుల లేఖ అందాక మిగిలిన సొమ్ము చెల్లించొచ్చని ముఠా సభ్యులు నమ్మిస్తున్నారు. ఇప్పటికే పోలవరం మండలానికి చెందిన కొందరు యువకులు కొంత మొత్తం చెల్లించినట్లు తెలిసింది. మరికొందరు నగదు సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. ఐసీడీఎస్‌లో ఉద్యోగాల విషయమై కొయ్యలగూడెం సీడీపీవోను సంప్రదించగా పోలవరం మండలంలో రెండు సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే మహిళల్లో సీనియారిటీ ప్రకారం ఎంపిక చేస్తామన్నారు. ప్రభుత్వ ప్రకటన మేరకే నియామకాలు చేపడతారన్నారు. ఐసీడీఎస్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తారన్న విషయం తమ దృష్టికి రాలేదన్నారు. అసలు నేరుగా నియామకాలు చేపడతారనడం పూర్తిగా అవాస్తవమన్నారు. మోసపూరిత వ్యక్తుల మాటల విషయంలో నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## ప్రయాణికులకు పరీక్ష



ఎండకు తాళలేక ర్యాంపు నీడలో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు నత్తనడకన సాగడంతో ఏలూరు రైల్వేస్టేషన్లో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. పైకప్పు లేకపోవడంతో ఎండకు తాళలేక ర్యాంపు నీడలో నిరీక్షిస్తున్నారు. ప్లాట్‌ఫాంపై వేయాల్సిన ఫలకల మధ్యలో కూర్చుంటున్నారు. తాగునీటి కుళాయిలను అమర్చకపోవడంతో నీళ్ల సీసాలను కొనుక్కొని తాగాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు, మూడు ప్లాట్‌ఫాంలకు చివరన ఒకే మరుగుదొడ్డి ఉంది. నిర్వహణ కొరవడటంతో అధ్వానంగా మారింది. ఐఆర్‌సీటీసీ విశ్రాంత గదులు, దుకాణాలు మూతపడ్డాయి. నిత్యం రద్దీగా ఉండే రైల్వేస్టేషన్లో త్వరితగతిన పనులు పూర్తిచేసి ప్రయాణికులకు సౌకర్యాలను మెరుగుపరచాలని వారంతా కోరుతున్నారు. దీనిపై సూపరింటెండెంట్ రమేశ్ మాట్లాడుతూ ప్రయాణికుల కోసం నిరీక్షణ గదులు, ఎస్కలేటర్ల పనులు జరుగుతున్నాయన్నారు. రెండు, మూడు ప్లాట్‌ఫాంల్లో మరుగుదొడ్ల ఏర్పాటుకు స్థలం చాలకపోవడంతో చివరన ఏర్పాటు చేశామని వాటిని బాగుచేయిస్తామన్నారు. -ఈనాడు, ఏలూరు.



అమర్చని తాగునీటి కుళాయిలు



పైకప్పు లేని ప్లాట్‌ఫాం



పైకి బాగానే కనిపిస్తున్న మరుగుదొడ్లు, లోపల అధ్వానమే

## ఆటో కార్మికుల వివాదం పరిష్కరించాలి



నినాదాలు చేస్తున్న ఆటో చోదకులు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఏలూరు, హనుమాన్ జంక్షన్, అప్పనవీడు ఆటో కార్మికుల మధ్య రవాణా వివాదాన్ని పరిష్కరించాలని ఆటో యూనియన్ అధ్యక్షుడు లీలా కృష్ణ, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకటరావు కోరారు. నగరం, గ్రామీణ మండలాల్లోని పలువురు ఆటో చోదకులు గురువారం పెద్దఎత్తున కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలకు ప్రదర్శనగా చేరుకొని వినతిపత్రాలు సమర్పించారు. వారు మాట్లాడుతూ... హనుమాన్ జంక్షన్, అప్పనవీడు నుంచి ఏలూరు వస్తున్న ఆటో కార్మికులను ఎక్కడా ఇబ్బంది పెట్టటం లేదన్నారు. కానీ, ఏలూరు నుంచి అప్పనవీడు, హనుమాన్ జంక్షన్ వైపు వెళ్తున్న తమను మాత్రం కొందరు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. దీనిపై అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని వారు కోరారు.

## ఖాతాదారుల నగదు సొంతానికి వాడుకున్న వారిపై కేసు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ఖాతాదారులు చెల్లించిన నగదును కంపెనీకి జమ చేయకుండా వ్యక్తిగత అవసరాలకు వాడుకున్న సిబ్బందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై జబీర్ కథనం మేరకు.. జంగారెడ్డిగూడెం పట్టణం రామచంద్రాపురంలో ఏర్పాటు చేసిన స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ ప్రైవేటు లిమిటెడ్‌లో మేనేజరుగా దాసరి వంశీ, కలెక్షన్ ఏజెంట్లుగా యర్రగొళ్ల రవితేజ, కంచర్ల ఉదయ్‌కుమార్, అబ్బుదాసరి నరేశ్‌లు పనిచేస్తున్నారు. వీరు కొద్ది నెలలుగా 125 మంది ఖాతాదారులు కంపెనీకి చెల్లించిన వాయిదాలు రూ.8,16,988లను సంస్థకు కట్టకుండా వ్యక్తిగతంగా వాడుకున్నారు. ఈ విషయం ఆడిట్‌లో బహిర్గతం కావడంతో బుధవారం సంస్థ ఆడిటర్ పులిమామిడి రమేశ్ ఫిర్యాదు మేరకు నలుగురు సిబ్బందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

## వసూళ్లలో దగా.. ఖజానాకు సెగ

భీమవరం పట్టణం, చింతలపూడి, పాలకొల్లు, న్యూస్‌టుడే: దుకాణాలు, కర్మాగారాలకు పురపాలక, నగరపాలక సంస్థలు జారీ చేసే డేంజరస్ అండ్ అఫెన్సివ్(డిఅండ్‌ఒ) ట్రేడ్ లైసెన్సు ఫీజు వసూళ్లలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. వేల సంఖ్యలో ఉన్న దుకాణాల నుంచి అనధికారికంగా లైసెన్సు ఫీజుల్ని వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. పట్టణాల్లో ఎలాంటి వ్యాపారాన్ని ప్రారంభించాలన్నా ప్రజారోగ్య విభాగం నుంచి 'డి అండ్ ఒ' ట్రేడ్ లైసెన్సును పొందాలి. అనంతరం ఏటా లైసెన్సుదారులు నిర్ణీత ఫీజు చెల్లించి రెన్యువల్ చేసుకోవాలి. ✦ భీమవరం వెంకట్రామా థియేటర్ రోడ్డు, మావుళ్లమ్మ గుడి పరిధిలో అధికంగా దుకాణాలున్నాయి. అక్కడి వ్యాపారుల నుంచి ట్రేడ్ లైసెన్సును పురపాలక ఉద్యోగులు కాకుండా ప్రైవేటు వ్యక్తులు వసూలు చేసి, రసీదు ఇవ్వకుండా పుస్తకంలో రాసుకుంటున్నారు. ఏడాదికని లైసెన్సు ఫీజు చెల్లిస్తే కొన్ని నెలల వ్యవధిలో మళ్లీ వస్తారని, ఇటీవల చెల్లించేశాం కదా అంటే బకాయి మీ పేరున ఉందంటూ వసూలు చేసుకుపోతుంటారని వ్యాపారులు వాపోతున్నారు. భీమవరంలో ఓ ఉద్యోగి గత ఆర్థిక సంవత్సరంలో వసూలు చేసిన రూ.2.10 లక్షలు ఖజానాలో జమ చేయలేదు.

### దుకాణాల సంఖ్యకు తగ్గట్టుగా ఆదాయం లేదంతే..!

పట్టణాల్లో ఇబ్బడి ముబ్బడిగా దుకాణాలున్నాయి దుకాణాల సంఖ్య పెరుగుతుంటే ట్రేడ్ లైసెన్సు ఫీజు మాత్రం మందగిస్తోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు 20 వేలు దుకాణాలున్నా ఆదాయం తగ్గుతుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ✦ 2018-19లో రూ.1.85 కోట్లు ✦ 2022-23లో రూ.1.63 కోట్లు

### డి అండ్ ఒ ట్రేడ్ లైసెన్సు జారీలో అవకతవకలు

కొవిడ్ అనంతరం వ్యాపారాలు పెరిగినా ఆదాయం పెరగలేదు. భీమవరం పట్టణంలో 2022-23లో 3,155 దుకాణాల నుంచి రూ.47 లక్షలు వసూలు చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి డిమాండ్ రూ.45 లక్షలు మించలేదు. ఏసీ సౌకర్యం కలిగిన దుకాణాలకు రూ.8 వేలు నుంచి రూ.10 వేలు, బంగారం దుకాణాలకు రూ.10 వేలు నుంచి రూ.15వేలు, చిన్నపాటి దుకాణమైతే రూ.వెయ్యి వరకు వసూలు చేస్తారు.

### చింతలపూడిలో..

చింతలపూడి నగర పంచాయతీగా వర్గోన్నతి పొంది నాలుగేళ్లు గడుస్తున్నా డి అండ్ ఒ ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా ఆదాయం రూ.5 లక్షల వరకు మాత్రమే ఉంది. మొత్తం 742 ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్నాయి. ఈ ఆదాయాన్ని పెంచేందుకు నగర పంచాయతీ అధికారులు గత కొన్నేళ్లుగా శ్రద్ధ పెట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి

✦ అనధికారిక వసూళ్లపై క్షేత్రస్థాయిలో విచారణ చేయిస్తాను. పూర్తి వివరాలు తీసుకోవాలని పట్టణ అధికారులకు సూచిస్తాను. - సీహెచ్ నాగ నరసింహారావు, పురపాలక ప్రాంతీయ సంచాలకుడు, రాజమహేంద్రవరం







## ఆవును ఢీకొన్న ద్విచక్ర వాహనం

### వివాహిత మృతి.. యువకుడికి తీవ్ర గాయాలు

మండవల్లి, న్యూస్‌టుడే: ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనం ఆవును ఢీకొన్న ఘటనలో వివాహిత మృతి చెందిన ఘటన మండవల్లి మండలంలో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కైకలూరు వెలమపేటకు చెందిన గునుపూడి కృష్ణ కైకలూరులో పూల దుకాణం నిర్వహిస్తుండగా.. ఆయన భార్య గౌరి(38) గృహిణి. వీరి రెండో కుమారుడు కృష్ణాజిల్లా గుడ్లవల్లేరులోని ఓ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. దసరా సెలవులు కావడంతో కుమారుడిని ఇంటికి తీసుకు వచ్చేందుకు గౌరి తమ దుకాణంలో పనిచేస్తున్న యువకుడు నజీర్‌ను తీసుకుని ద్విచక్ర వాహనంపై గుడ్లవల్లేరు వెళ్తున్నారు. మండలంలోని చావలిపాడు ప్రధాన కూడలికి వచ్చే సమయానికి రోడ్డుపైకి అకస్మాత్తుగా ఆవు రావడంతో బలంగా దానిని ఢీ కొట్టారు. వాహనం వెనుక కుర్చున్న గౌరి రోడ్డుపై పడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. వాహనం నడుపుతున్న నజీర్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఏలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

## మానసిక ప్రశాంతతతో ఆరోగ్యం

ఏలూరు టూటౌన్ న్యూస్‌టుడే: మానసికంగా ప్రశాంతంగా ఉండటం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ అన్నారు. స్థానిక జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆహార నియమాలు పాటిస్తూ.. విధిగా వ్యాయామం చేయాలన్నారు. తద్వారా వ్యాధులకు దూరంగా ఉండొచ్చన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 60 శాతం మంది వివిధ ఉద్యోగాలు చేస్తున్నారని, వారిలో ఎక్కువ శాతం మంది మానసిక ఒత్తిడితో కుంగుపాటుకు గురవుతున్నారని చెప్పారు. మానసిక వ్యాధుల చికిత్స, కౌన్సెలింగ్‌కు ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు.

## కోళ్ల వ్యాన్ ఢీకొని భవానీ భక్తుడి దుర్మరణం

కైకరం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: కోళ్ల వ్యాన్ ఢీకొనడంతో భవానీ భక్తుడు దుర్మరణం చెందిన సంఘటన 216ఏ జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. చేబ్రోలు పోలీసుల కథనం మేరకు... తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం మండలం రాజవోలుకు చెందిన కాసాపు వెంకట మణికంఠ సాయి(21) హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. భవానీ దీక్ష చేపట్టేందుకు గత నెల 28న స్వగ్రామానికి వచ్చారు. 30న స్థానికులతో కలిసి భవానీ మాల ధరించారు. దుర్గమ్మ దర్శనార్థం కాలినడకన విజయవాడ బయల్దేరారు. మార్గం మధ్యలోని కైకరం బీసీ కాలనీ వద్ద చేబ్రోలు నుంచి భీమడోలు వెళ్తున్న కోళ్ల వ్యాన్ మణికంఠ సాయిని వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడ్ని 108 వాహనంలో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి మామ పర్వత వీరబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సూర్యభగవాన్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు.. జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన జంగారెడ్డిగూడెం పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడెం మండలం మంగిశెట్టిగూడేనికి చెందిన జల్లి ముత్తమ్మ(60) స్థానిక బస్టాండ్ సమీపంలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తుంటుంది. కొత్త బస్టాండ్ లోపలి గేటు నుంచి బయటకు వస్తున్న ఆమెను.. రాజమహేంద్రవరం నుంచి జంగారెడ్డిగూడెం వచ్చిన స్థానిక డిపో బస్సు ఢీకొట్టింది. బస్సు ఆమె పైనుంచి వెళ్లడంతో ఘటనాస్థలిలోనే మృతిచెందింది. జంగారెడ్డిగూడెం ఎస్సై జబీర్ సంఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని ప్రాంతీయాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు. నిర్లక్ష్యంగా బస్సు నడిపిన చోదకుడు ప్రసాద్‌ను విధుల్లో నుంచి తొలగించినట్లు డీఎం పి.గంగాధరరావు తెలిపారు.

**బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)** (కిలో 1 కి రూ.ల్లో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు: కలెక్టర్

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలని.. ఆ దిశగా వైద్యులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక సర్వజన ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలు, సమస్యలపై వైద్యాధికారులతో గురువారం సాయంత్రం సమావేశమై మాట్లాడారు. దివ్యాంగుల పింఛను మార్పునకు సంబంధించి బుధ, శనివారాల్లో ధ్రువపత్రాలు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ రక్త పరీక్షల నిర్వహణ సరిగా ఉండాలని, రిపోర్టులు త్వరితం అందించాలన్నారు. అవసరమైన వారికి ప్లేట్‌లెట్లు, రక్తం అందించేందుకు రెడ్‌క్రాస్‌ను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. సామాన్య రోగులపై భద్రతా సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందులు, వైద్య పరికరాలపై వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. గర్భిణులకు స్కానింగ్ చేసే విషయంలో అలసత్వం వహిస్తే ఉపేక్షించబోమని, సదరు రేడియాలజిస్టులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. డీసీహెచ్ఎస్ పాల్ సతీష్, డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ, ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ మల్లికార్జునరావు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

# ఏలూరు

• ఏలూరు • దెందులూరు • ఉంగుటూరు

## పత్తేపురం విద్యార్థిని ప్రతిభ


అమృత

నిడమర్రు, న్యూస్‌టుడే: ప్రపంచ బాలికా దినోత్సవం సందర్భంగా ఏలూరులో నిర్వహించిన జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో పత్తేపురం ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని సిరిశెట్టి అమృత లక్ష్మీసాయి ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో రెండో స్థానంలో నిలిచిన ఆమెకు శుక్రవారం కలెక్టర్ వెట్రిసెల్వి నుంచి బహుమతి అందుకోనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు పీవీ సత్యనారాయణ తెలిపారు. విద్యార్థినిని సర్పంచి నీలపాల సాయిప్రియ, ఉప సర్పంచి రుద్రరాజు కొండ్రాజు, ఎంఈవోలు పి.శేషు, జి.బాలయ్య, ఎస్ఎంసీ ఛైర్మన్ ఎన్.దేవి, గైడు ఉపాధ్యాయుడు కె.సుబ్బరాజు గురువారం అభినందించారు.

## అభివృద్ధి పనులు వేగిరం చేయాలి


పద్మశ్రీకి మొక్క ఇస్తున్న డీపీవో, డ్వామా పీడీ

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ సూచించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జిల్లా పంచాయతీ అధికారిణి కె.అనురాధ, డ్వామా పీడీ కె.సుబ్బారావు జడ్పీ విడిది కార్యాలయంలో పద్మశ్రీని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందజేశారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** 10 AM to 1 PM

ఏలూరు తూర్పువీధి: 80081 23847 | ఏలూరు గ్రామీణ: 80085 74535
పెదపాడు, పెదవేగి: 80085 74483 | ఉంగుటూరు: 79933 00492

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే

**సమస్య:** తూర్పువీధి సంతాన వేణుగోపాలస్వామి ఆలయ రోడ్డులో మురుగు కాలువలను శుభ్రం చేయడం లేదు. మురుగు సరిగా ప్రవహించకపోవడంతో దుర్వాసన వస్తోంది. దోమల బెడద అధికంగా ఉంటోంది. **- జిల్లెళ్లమూడి ప్రసాదరావు, స్థానికుడు**

**సమాధానం:** కాలువలో పూడిక తీయించి, దోమల నివారణకు మందు పిచికారీ చేయిస్తాం. **- శివారెడ్డి, నగరపాలక అదనపు అధికారి**

**సమస్య:** వెన్నవెల్లివారిపేట రిక్షా కాలనీ రెండో రోడ్డులో నివాసాల ముందున్న వీధి దీపం వెలగడం లేదు. రాత్రివేళ రాకపోకలు సాగించేందుకు పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **- రెడ్డియ్య, స్థానికుడు**

**సమాధానం:** సిబ్బందిని పంపి వీధి దీపానికి మరమ్మతులు చేయిస్తాం. **- కె.శేషగిరి, విద్యుత్తు ఏఈ**

### దోమల మందు పిచికారీ

స్పందనకు వందనం

**ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే:** సత్రంపాడు మండావారివీధిలోని మురుగు కాలువలో పేరుకుపోయిన పూడికను పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. దోమల నివారణకు మందు పిచికారీ చేశారు. కాలువలో మురుగు నిలిచిపోవడంపై 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ఈ నెల 8న వార్త ప్రచురితమైంది. నగరపాలక సహాయాధికారి జి.చంద్రయ్య స్పందించి సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేయించారు.

**వెలిగిన వీధి దీపం..** సత్రంపాడు ఎమ్మార్సీ కాలనీ రామాలయం రోడ్డులోని వీధి దీపం ఎట్టకేలకు వెలిగింది. పది రోజులుగా దీపం వెలగకపోవడంపై ఈ నెల 9న ప్రచురితమైన వార్తకు విద్యుత్తు ఏఈ కె.శేషగిరి స్పందించారు. సిబ్బందిని పంపి దీపానికి మరమ్మతులు చేయించారు.

**పూడిక తొలగింపు..** ఆర్.ఆర్.పేట శ్రీనివాస థియేటర్ రోడ్డులోని ప్రధాన మురుగు కాలువలో పూడిక తీయించారు. కాలువలో మురుగు నిలిచిపోవడంపై ఈ నెల 8న ప్రచురితమైన వార్తకు పారిశుద్ధ్య తనిఖీదారు కంభంపాటి స్టీఫెన్‌రాజు స్పందించారు. సిబ్బందిని పంపి కాలువలో పూడిక తీయించారు.

## పారని మురుగు.. పారిశుద్ధ్యం కనుమరుగు!

• కాలువల్లేక రోడ్లపైనే వాడుకనీరు ప్రవాహం • ఇబ్బందులు పడుతున్న గ్రామీణులు

పల్లెలను మురుగు ముంచెత్తుతోంది. ఏ వీధిలో చూసినా మురుగు ముందుకెళ్లక ఎగదన్నుతోంది. పారిశుద్ధ్యం లోపించడంతో ప్రజలు ఆరోగ్యం బారిన పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో గ్రామీణులు అడుగు పెట్టలేని పరిస్థితులున్నాయి. ఓవైపు ముక్కుపుటాలదిరే దుర్వాసన, మరోవైపు దోమల విజృంభణతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **- న్యూస్‌టుడే, చాటపర్రు (ఏలూరు గ్రామీణ)**


యాదవ్ నగర్‌లో...

ఏలూరు గ్రామీణ మండలంలో 15 గ్రామ పంచాయతీలున్నాయి. ఎక్కడా భూగర్భ మురుగు కాలువల్లేవు. ఎటుచూసినా మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా కనిపిస్తోంది. పారిశుద్ధ్యం పూర్తిగా లోపించడంతో ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. మురుగు ముందుకెళ్లక రోజుల తరబడి పేరుకుపోయి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతోంది. చిన్నపాటి వర్షానికే కాలువల్లోని మురుగు నీరంతా బయటికొచ్చి రోడ్లపై పారుతోంది. రోజుల తరబడి రహదారులు మురుగు నిలిచిపోవడంతో... అందులోనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి. ప్రధానంగా చాటపర్రు ఎస్సీ, బీసీ కాలనీలు, యాదవ్ నగర్, కోటేశ్వర దుర్గాపురం, మొండికోడు, జాలిపూడి, ప్రత్తికోళ్లలంక, గుడివాకలంక, శ్రీపర్రు బీసీ కాలనీల్లో కొన్నాళ్లుగా పారిశుద్ధ్యం లోపించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**వైకాపా వైఫల్యాలతో...**

గత వైకాపా ప్రభుత్వం భూగర్భ కాలువల వ్యవస్థకు నిధులు మంజూరు చేయలేదు. కనీసం పారిశుద్ధ్య నిర్వహణకూ చొరవ చూపలేదు. ఉపాధిహామీ నిధులతో చేపట్టనున్న పనుల్లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థకు ప్రాధాన్యమివ్వాలని గ్రామీణ కోరుతున్నారు. ఎన్డీయే ప్రభుత్వ హయాంలోనైనా డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. 'కోటేశ్వరదుర్గాపురం, మొండికోడు, మాదేపల్లి గ్రామ పంచాయతీల్లో భూగర్భ కాలువల నిర్మాణానికి రూ.45 లక్షల అంచనాలతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం' అని ఇన్‌ఛార్జి ఏపీవో బాషా తెలిపారు.


చాటపర్రు కాలనీలో రోడ్డుపై నిలిచిన మురుగు

## శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం


ఎమ్మెల్యేకు మొక్క అందిస్తున్న అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

**పెదవేగి, న్యూస్‌టుడే:** శాంతిభద్రతల పరిరక్షణకు ఎన్డీయే ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో ఆయన్ను ఇటీవల అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నక్కా సూర్యచంద్రరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. చింతమనేని మాట్లాడుతూ.. వైకాపా పాలనలో పోలీసు వ్యవస్థ విచ్ఛిన్నమైందన్నారు. పోలీసులపై ప్రజలకు నమ్మకం కలిగించేలా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు.

## వేతనం పెంచాలని వినతి

**భీమడోలు, న్యూస్‌టుడే:** పంచాయతీల్లో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు కనీస వేతనంగా రూ.18,500 వేలు ఇవ్వాలని ఏపీ ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల సంక్షేమ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఏలూరులో డీపీవో కె.అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి గురువారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ... వేతనాలు పెంచుతూ పంచాయతీరాజ్ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బి.ఎన్.దుర్గారావు, కోశాధికారి కె.లావణ్య, కార్యదర్శులు డి.ఆదిత్య, ఎస్‌కే వలీబాబా, జి.ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్డీయే అభ్యర్థులను గెలిపించాలి: ఎమ్మెల్యేలు

**నారాయణపురం(ఉంగుటూరు), న్యూస్‌టుడే:** ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా ఎన్డీయే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పిలుపునిచ్చారు. నారాయణపురం క్యాంపు కార్యాలయంలో ఎన్డీయే నాయకులు, కార్యకర్తలతో గురువారం సమావేశమయ్యారు. పరిశీలకుడిగా ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అధ్యక్షత వహించారు. వారు మాట్లాడుతూ.. ఓటర్ల నమోదు గడువు నవంబరు 6తో ముగియనుందన్నారు. పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదయ్యేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ.. శాసనమండలిలో ఎన్డీయే బలం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రతిపాదనలో ఉన్న పేరాబత్తుల రాజశేఖర్‌ను పరిచయం చేశారు. అంతకుముందు రతన్‌టాటా మృతికి సంతాపం తెలిపారు. జనసేన ఎన్నికల సమన్వయకర్త వట్టి పవన్‌కుమార్, ఎన్డీయే నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఉంగుటూరు: మాట్లాడుతున్న ధర్మరాజు

**ఏలూరు టూటౌన్:** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బడేటి చంటి పిలుపునిచ్చారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో గురువారం సమావేశమయ్యారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఎన్డీయే అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌ను శ్రేణులకు పరిచయం చేశారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవరావు, తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు హాజరయ్యారు. అంతకుముందు పారిశ్రామికవేత్త రతన్ టాటా మృతికి నివాళులర్పించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రెడ్డి అప్పలనాయుడు, తెదేపా నగరాధ్యక్షుడు పెద్దిబోయిన శివప్రసాద్, భాజపా నాయకుడు దాన భాస్కరరావు, కో-ఆప్షన్ సభ్యులు వెంకటరత్నం పాల్గొన్నారు.


ఏలూరు: ప్రసంగిస్తున్న చంటి


మాట్లాడుతున్న జిల్లా ఛైర్మన్ కృష్ణారెడ్డి

## రెడ్‌క్రాస్ సేవలు విస్తృతం చేస్తాం

**ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే:** రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను మరింత విస్తరించనున్నట్లు ఆ సంస్థ జిల్లా ఛైర్మన్ డాక్టర్ బీవీ కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని సంస్థ కార్యాలయంలో గురువారం మేనేజింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కృష్ణారెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. విజయవాడతో పాటు ఏలూరు జిల్లాలో వరద బాధితుల సహాయార్థం వైద్య శిబిరాలు, ముంపు ప్రభావిత ప్రాంత ప్రజలకు టార్పాలిన్లు, దుప్పట్లు, వంట సామగ్రి పంపిణీ చేశామని గుర్తుచేశారు. తలసేమియా చిన్నారులకు క్రమం తప్పకుండా రక్తమార్పిడి చేస్తున్నామని చెప్పారు. అంతకుముందు రతన్ టాటా మృతికి సంతాపం తెలిపారు. సంస్థ జిల్లా కార్యదర్శి సీతారామ్, కోశాధికారి శివప్రసాద్, డాక్టర్ వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల శుభ్రత సామాజిక బాధ్యత

**గణపవరం, న్యూస్‌టుడే:** పరిసరాల పరిశుభ్రతను సామాజిక బాధ్యతగా తీసుకోవాలని మలేరియా ఉప అధికారి వై.లక్ష్మణరావు అన్నారు. కేశవరంలో పిప్పర పీహెచ్‌సీ ఆధ్వర్యాన గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య విస్తరణాధికారి జి.వెంకటేశ్వరరావు, ఆరోగ్య కార్యదర్శి శ్రీదేవి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఏలూరు సినిమా

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే

| | |
|---|---|
| అంబిక డీలక్స్ | కమిటీ కుర్రోళ్లు |
| అంబిక మినీ | రామనగర్ బన్నీ |
| సాయిబాలాజీ | కాళీ |
| బాలాజీ | శ్వాగ్ |
| సత్యనారాయణ స్క్రీన్ 1 | విశ్వం |
| సత్యనారాయణ స్క్రీన్ 2 | వేట్టయన్ |
| సత్యనారాయణ స్క్రీన్ 3 | వేట్టయన్ |
| విజయలక్ష్మి వీమ్యాక్స్ 1 | దేవర |
| విజయలక్ష్మి వీమ్యాక్స్ 2 | సెలబ్రెటీ |
| విజయలక్ష్మి వీమ్యాక్స్ 3 | జిగ్రా |
| ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1 | వేట్టయన్ |
| ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2 | వేట్టయన్ |
| ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3 | విశ్వం |
| ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4 | విశ్వం |

## పౌష్టికాహారంతో ఆరోగ్యం


గర్భిణిని పరీక్షిస్తున్న వైద్యాధికారిణి కిరణ్మయి

**గణపవరం, న్యూస్‌టుడే:** గర్భిణులు రోజూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారిణి కిరణ్మయి అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో గురువారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా 76 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ... ప్రతి గర్భిణీ విధిగా ఆరోగ్య కేంద్రానికొచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

## ఏలూరు బస్టాండులో వ్యక్తి మృతి

**ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** ఏలూరు బస్టాండులోని 15వ ప్లాట్‌ఫాం వద్ద గురువారం ఉదయం ఓ వ్యక్తి మృతి చెందాడు. బల్లపై కూర్చొని అచేతనంగా ఉన్న అతన్ని సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మూడో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడ్ని తాడేపల్లిగూడెం మండలం పాతూరుకు చెందిన రెంకిరెడ్డి శ్రీనివాస చక్రవర్తి అలియాస్ చిన్నా(45)గా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కోళ్ల వ్యర్థాల లారీ స్వాధీనం

**పెదపాడు, న్యూస్‌టుడే:** పర్యావరణానికి హాని కలిగించే కోళ్ల వ్యర్థాలు రవాణా చేస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌ఛార్జి ఎస్సై కె.ఎస్.సతీశ్ గురువారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. విజయవాడ పరిసర ప్రాంతాల నుంచి సేకరించిన కోళ్ల వ్యర్థాలను మండలంలోని చేపల చెరువులకు మేతగా వినియోగించేందుకు తరలిస్తున్నారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేసి లారీని స్వాధీనం చేసుకున్నారు. అలాగే గుడిపాడులో చేపల చెరువుకు కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. లారీ, ట్రాక్టర్ యజమానులు, లారీ డ్రైవర్, క్లీనర్‌పై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.


ఏలూరు: దుర్గాదేవిగా అంబికాదేవి


ఏలూరు: కనకదుర్గమ్మ



సుంకరవారితోటలో..


భీమడోలు: భ్రమరాంబ



పెదపాడు: రాట్నాలమ్మ, కనకమహాలక్ష్మి


నిడమర్రు: మందలపర్రులో..


ఉంగుటూరు: చల్లాలమ్మ

## కాత్యాయని.. ఖడ్గధారిణి

ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నయనానందకరంగా సాగుతున్నాయి. ఎటుచూసినా ఆధ్యాత్మికత ఉట్టిపడుతోంది. ఎనిమిదో రోజైన గురువారం అమ్మవార్లు దుర్గాదేవిగా భక్తులకు అభయమిచ్చారు. ఏలూరు నగరంలోని అగ్రహారం, సత్రంపాడు, దొండపాడు, హనుమాన్‌నగర్, బావిశెట్టివారి పేట, పత్తేబాద, 12 పంపుల కూడలి, సత్యనారాయణ పేట, సుంకరవారితోట, చాటపర్రులోని అమ్మవార్ల ఆలయాల్లో మహిళలు వేదోక్తంగా కుంకుమార్చనలు చేశారు. లలితా సహస్రనామ పారాయణ, దేవీ ఖడ్గమాల స్తోత్రపారాయణను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భీమడోలు, పెదపాడు, పెదవేగి, నిడమర్రు, ఉంగుటూరు మండలాల్లోని ఆలయాల్లోనూ విశేష పూజలు, అలంకరణలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకొని.. శక్తి స్వరూపిణులను దర్శించి తరించారు. వారికి అర్చకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. **- న్యూస్‌టుడే బృందం**


ఏలూరు: మహిళల కుంకుమ పూజలు

## 'పల్లె పండగ' విజయవంతానికి పిలుపు


సమీక్షిస్తున్న రాజ్‌మనోజ్

**ఉంగుటూరు, న్యూస్‌టుడే:** మండలంలో ఈ నెల 14 నుంచి నిర్వహించనున్న పల్లె పండగ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ కోరారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై మాట్లాడారు. మండలంలో ఉపాధిహామీ పథకం కింద 33 పనులకు రూ.4.91 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. జనవరి నాటికి పనులు పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని దిశానిర్దేశం చేశారు. ఇన్‌ఛార్జి తహసీల్దారు పూర్ణచంద్రప్రసాద్, ఈవోపీఆర్డీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వెల్లమిల్లి వాసికి 'రైతు నేస్తం' పురస్కారం


సత్యనారాయణ

**వెల్లమిల్లి(ఉంగుటూరు), న్యూస్‌టుడే:** వెల్లమిల్లికి చెందిన పరిమి సత్యనారాయణ రైతు నేస్తం పురస్కారానికి ఎంపికయ్యారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త దివంగత డాక్టర్ ఐ.వి.సుబ్బారావు పేరిట వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ప్రతిభ చూపిన శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు, విస్తరణ విభాగాల్లో ముప్పవరపు ఫౌండేషన్‌తో కలిసి ఏటా 'రైతు నేస్తం' పురస్కారాలు అందిస్తున్నారు. కృష్ణా జిల్లా ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్టులో ఈ నెల 20న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతులమీదుగా సత్యనారాయణ పురస్కారం అందుకోనున్నారు.

## నియంత్రిక.. నియంత్రించాలిక!



ఏలూరు నగరంలోని ఎస్బీఐ సమీపంలోని విద్యుత్తు నియంత్రిక ప్రాంగణం డంపింగ్‌యార్డును తలపిస్తోంది. ఇక్కడ ఎండిపోయిన ఆకులు, ఇతర వ్యర్థాలు పడేస్తున్నారు. ఎవరైనా ఎండిన ఆకులకు అగ్ని పెడితే పెను ప్రమాదం సంభవించే అవకాశముంది. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి వ్యర్థాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు గ్రామీణ**

## కుమ్మేసిన వర్షం



ఏలూరు నగరంలో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. స్థానిక మినీ బైపాస్ రోడ్డు సమీప రైల్వే వంతెన కింద వర్షపు నీరు నిలిచిపోయింది. ఆ నీటిలోనే వాహన చోదకులు ఇబ్బంది పడుతూ రాకపోకలు సాగించారు. **- ఈనాడు, ఏలూరు**

## వాచ్‌మెన్ ఇంట్లో చోరీ

**ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** తాళమేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడిన నగరంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... చోడిదిబ్బ ప్రాంతానికి చెందిన రెళ్ల మోహనరావు వాచ్‌మెన్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 9న రాత్రి విధులకు వెళ్లారు. అతడి భార్య రేణుకాదేవి ఇంటికి తాళమేసి కొత్తపేటలోని కుమార్తె ఇంటికెళ్లారు. గురువారం ఉదయం ఇంటికొచ్చి చూసేసరికి తలుపు తాళాలు పగులగొట్టి... బీరువాలోని రూ.30 వేలు నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రాణహాని ఉందని ఆందోళన

**ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** పెదయాగనమిల్లికి చెందిన ఓ వ్యక్తి నుంచి తమకు ప్రాణహాని ఉందని సైదు సత్యనారాయణ తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా చేశారు. చేపల చెరువుల మేతలకు సంబంధించిన బకాయి తీర్చినా, ఇంకా ఉందంటూ వేధిస్తున్నారన్నారు. అతడ్ని నుంచి తమను కాపాడాలని వారు అధికారులు ఏకరవు పెట్టారు.

## ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

**ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే:** హిందూ దేవాలయాలపై అధికారుల అజమాయిషీ కట్టడికి ప్రభుత్వం జీవో జారీ చేయడం హర్షణీయమని ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నగర బ్రాహ్మణ ఐక్య కార్యాచరణ సమితి గౌరవాధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. హిందూ దేవాలయాలపై అధికారుల అజమాయిషీ ఉండకుండా, ఎండోమెంట్ అధికారుల జోక్యం లేకుండా ప్రభుత్వమిచ్చిన ఆదేశాలను యావత్ బ్రాహ్మణ సమాజం స్వాగతిస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు గురువారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

## అల్లుకున్న నిర్లక్ష్యం..!


భీమడోలు మండలం పాతూరులో...



ఉంగుటూరు మండలం కైకరంలో స్తంభానికి ఎగబాకిన పాదులు

ఇటీవల కురిసిన వర్షాలకు ఎటుచూసినా పచ్చదనమే కనిపిస్తోంది. భీమడోలు, ఉంగుటూరు మండలాల్లోని పలు ప్రాంతాల్లో విద్యుత్తు నియంత్రికలు, స్తంభాలు, తీగలకు పిచ్చిమొక్కల పాదులు అల్లుకుపోయాయి. ఆయా మార్గాల్లో పెద్ద సంఖ్యలో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రమాదాలు సంభవించక ముందే విద్యుత్తు శాఖాధికారులు స్పందించి పిచ్చిమొక్కల తీగలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. **- ఈనాడు, ఏలూరు**

## బడి పిల్లలకు అపార్!

• త్వరలో 12 అంకెల నంబరు కేటాయింపు • వినూత్న కార్యక్రమానికి కేంద్రం శ్రీకారం

జాతీయ విద్యావిధానంలో భాగంగా ఒకే దేశం- ఒకే విద్యార్థి(వన్ నేషన్ వన్ స్టూడెంట్) నినాదంతో కేంద్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధార్ తరహాలో కేజీ నుంచి పీజీ విద్యార్థులకు 12 అంకెలతో కూడిన అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) అందించనుంది. **- న్యూస్‌టుడే, ఉంగుటూరు**



ఉంగుటూరు నియోజకవర్గంలో 157 ప్రాథమిక, 19 ప్రాథమికోన్నత, 30 ఉన్నత పాఠశాలలున్నాయి. మొత్తం 15,277 మంది విద్యార్థులు చదువుతున్నారు. తొలుత 9, 10 తరగతుల విద్యార్థులకు అపార్ కార్డు జారీ చేయనున్నారు. ఈ మేరకు తల్లిదండ్రుల నుంచి అనుమతి పత్రం తీసుకోనున్నారు. విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశానుసారం నియోజకవర్గంలో ప్రక్రియను మొదలుపెట్టారు. ఇప్పటికే విద్యార్థుల తల్లిదండ్రులకు అపార్‌తో కలిగే ప్రయోజనాలను వివరించారు. దసరా సెలవుల అనంతరం 14 నుంచి నమోదు ప్రక్రియ ప్రారంభించనున్నారు.

**ప్రయోజనాలివీ...**

☛ విద్యార్థులు వివిధ కారణాలతో పలు పాఠశాలలు మారుతుంటారు. అపార్ గుర్తింపు సంఖ్య ద్వారా వివిధ రాష్ట్రాల్లోని విద్యా బోర్డులతో ఏకీకృత వ్యవస్థగా పని చేస్తుంది. సులభంగా పాఠశాలలు మారొచ్చు.

**నియోజకవర్గ వివరాలిలా...**

| మండలం | పాఠశాలలు | విద్యార్థులు |
|---|---|---|
| ఉంగుటూరు | 67 | 5,565 |
| భీమడోలు | 43 | 3,123 |
| నిడమర్రు | 41 | 2,651 |
| గణపవరం | 55 | 3,937 |

☛ అపార్ గుర్తింపుతో విద్యార్థులు డిజిలాకర్‌కు అనుసంధానం అవుతారు. విద్యా, విషయక విజయాలు, ధ్రువపత్రాలను డిజిటల్ రూపంలో సురక్షితంగా భద్రపరుచుకోవచ్చు. విద్యార్థుల అకడమిక్ దస్త్రాల పర్యవేక్షణ ద్వారా డ్రాపౌట్లు తగ్గించవచ్చు.

☛ విద్యార్థుల ఉపకార వేతనాలు, వారు పొందుతున్న ప్రభుత్వ ప్రయోజనాలు, వివిధ విద్యా సంస్థల్లో చేరికలు, మార్పులు అపార్ ఆధారంగా నిర్వహించేలా రూపొందించారు.

**ఆధార్‌కు అనుసంధానం**

ఆధార్ కార్డు ఆధారంగా అపార్ గుర్తింపు సంఖ్య నమోదవుతుంది. ప్రతి విద్యార్థి తన ఆధార్‌కు చరవాణి నంబరు విధిగా అనుసంధానం చేయించుకోవాలి. డిజిటల్ కార్డులో విద్యార్థి పూర్తి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో, క్యూఆర్ కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు సంఖ్య ఉంటుంది. **- రవీంద్రభారతి, డీవైఈవో, తాడేపల్లిగూడెం**

## ఓటర్ల నమోదు ప్రక్రియపై నేడు శిక్షణ



సమావేశంలో పాల్గొన్న నాయకులు

**జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదు, అవగాహన సదస్సు స్థానిక సూర్య ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించనున్నట్లు తెదేపా పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ తెలిపారు. ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో సదస్సు జరుగుతుందన్నారు. ఈ మేరకు పట్టణంలో గురువారం నిర్వహించిన సమావేశంలో నాయకులు సాయిల సత్యనారాయణ, పరిమి సత్యనారాయణ, అల్లూరి రామకృష్ణ, బొబ్బర రాజ్‌పాల్, కిరణ్, రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

## 'స్థానికులకే ఇసుక రవాణా బాధ్యత అప్పగించాలి'

**కుక్కునూరు, న్యూస్‌టుడే:** మండలంలోని ఇబ్రహీంపేట, వింజరం రేవుల నుంచి రోజూ వందల సంఖ్యలో ఇతర ప్రాంతాల వాహనాలు ఇసుక రవాణా చేస్తున్నాయని, ఆ అవకాశం స్థానిక లారీల వారికే ఇవ్వాలని వాటి యజమానుల సంఘం కోరింది. గురువారం స్థానిక ఆ సంఘ కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మండల కార్యదర్శి సాయికిరణ్ మాట్లాడుతూ స్థానిక లారీలకు కిరాయిలు లేక యజమానులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో మహ్మద్ వలీ పాషా, ఎల్లయ్య, మల్లేశ్, రవి, కాశీ, నాగరాజు, వెంకటేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## న్యాయ విజ్ఞాన సదస్సు

**జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** పట్టణంలోని ఎస్సీ కాలనీ యూపీహెచ్‌సీలో గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముళ్లపూడి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్ ఐ.సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య సేవలు

**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** బుట్టాయగూడెం మండలం అచ్చియ్యపాలెంలో ఆమెన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచి కుంజా వెంకటేశ్వరరావు ప్రారంభించారు. వైద్యులు గంగాధరరావు, దీపాంజలి 167 మంది రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ట్రస్టు అధ్యక్షుడు కరెడ్డి ఇవాంజికల్ అశోక్, ఐటీడీఏ ఏఎంవో శిరమయ్య తదితరులు పాల్గొన్నారు.

# అన్నీ ఉన్నాయంటారు... బయట కొనమంటారు..!

### ప్రాంతీయాసుపత్రిలో రోగులకు పూర్తిస్థాయిలో అందని ఉచిత మందులు

**జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రిలో రోగులకు పూర్తి స్థాయిలో ఉచిత మందులు అందడం లేదు. ప్రతి క్వార్టర్‌కు సర్జికల్‌తో కలిపి ఔషధాలకు రూ.12.50 లక్షల వరకు బడ్జెట్ ఉంటోంది. అయినప్పటికీ చాలా రకాల ఇంజెక్షన్లు, మాత్రలు, సిరప్‌లు బయట కొనిపిస్తున్నారు. ఒకటి, రెండు విభాగాలే కాదు.. దాదాపు అన్ని విభాగాల రోగులు ఎన్నో కొన్ని మందులు కొనక తప్పడం లేదు. ప్రాంగణంలోనే ప్రైవేటు దుకాణం సౌలభ్యం కూడా కల్పించారు. ప్రాంతీయ ఆసుపత్రిలో అందుబాటులో లేక బయటకు రాస్తున్న మందులకు సంబంధించి గురువారం 'న్యూస్‌టుడే' పరిశీలించగా పలు విషయాలు వెలుగు చూశాయి. చాలా మంది రోగులు, వారి బంధువులు బయటి దుకాణాల నుంచి కొనుగోలు చేయడం కనిపించింది.



ఆసుపత్రిలో బారులు తీరిన రోగులు

**దయాలసిస్ బాధితుడికి..**



'మాది బొర్రంపాలెం. గ్రామానికి చెందిన పారేపల్లి రాంబాబుకు డయాలసిస్ చేస్తున్నారు. ఆయన కోసం వైద్యులు రాసిన ఇంజెక్షన్, సెలైన్‌ను రూ.150తో కొన్నాను' అని పెంటపాటి సత్యనారాయణ పేర్కొన్నారు.

**ఇంజెక్షన్‌కు రూ.60**



'నా భార్య శైలుకు పురిటి నొప్పులు వస్తే ప్రసవానికి తీసుకొచ్చాం. ఆమె లేబర్ రూమ్‌లో ఉంది. ఎపిడోసిన్ 3, డ్రొటావిన్ 3 ఇంజెక్షన్లు బయట కొని తెమ్మన్నారు. వీటిని రూ.60 పెట్టి కొనుగోలు చేశాను'అని జంగారెడ్డిగూడేనికి చెందిన ఎం.ప్రసాద్ చెప్పారు.

**రూ.300 పెట్టి కొన్నా..**



'కాలికి దురద వస్తే వచ్చా. ఆసుపత్రిలో కొన్ని మందులు ఇచ్చారు. ఇవి కాక సిరప్, జెల్‌ట్యూబ్ తదితరాలు కొనుక్కోమన్నారు. వీటికి రూ.300 ఖర్చు అయ్యింది'అని శ్రీనివాసపురానికి చెందిన రైతు యడ్లపల్లి శ్రీనివాస్ తెలిపారు.

**మందుల కొనుగోలుకు ప్రతిపాదన**

'బయటకు మందులు ఏమీ రాయకుండా చర్యలు తీసుకుంటాం. హెచ్‌డీఎస్ సమావేశంలో అవసరమైన మందులు కొనుగోలుకు ప్రతిపాదిస్తాము'అని ఆర్ఎంవో రాంబాబు తెలిపారు.



**టి.నరసాపురం, న్యూస్‌టుడే**

**సమస్య:** గ్రామంలోని ఎస్సీపేటలో మురుగు కాలువ నిర్మాణానికి కొద్ది రోజుల కిందట గాడి తీసి వదిలేశారు. ప్రస్తుతం అది ప్రమాదకరంగా మారింది. **-స్థానికులు, అప్పలరాజుగూడెం**

**సమాధానం:** వర్షాలతో పాటు, కూలీల కొరతతో పనులు పూర్తి చేయడంలో జాప్యం జరిగింది. వారం రోజుల్లో పూర్తి చేస్తాం. **-వంశీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి**

## పరుగు పందెం విజేతకు అభినందన

**జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** జంగారెడ్డిగూడేనికి చెందిన అథ్లెట్ విజయ దుర్గాప్రసాద్‌ను గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అభినందించారు. రాజమహేంద్రవరంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో 5, 10 కిలోమీటర్ల పరుగు పందెంలో విజయదుర్గాప్రసాద్ బంగారు పతకం సాధించాడు. ఈ నేపథ్యంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దండు ధనరాజు, పలువురు ప్రముఖులు అభినందించారు. కార్యక్రమంలో పీడీ రాజేంద్రప్రసాద్, ఘంటసాల గణపతి, గడ్డమణుగు విజయ్‌కుమార్, కుక్కునూరు రామచంద్రరావు, దొంతు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.



వరి పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

## తెగుళ్ల నివారణపై అవగాహన అవసరం

**కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** వరి పైరులో ఆకుముడత, ఎండాకు తెగుళ్ల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. పొంగుటూరు, కన్నాయగూడెం గ్రామాల్లో ఏలూరుకు చెందిన ఏరువాక కేంద్రం సమన్వయాధికారి కె.ఐజీకుమార్, విజయరాయి వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త పి.వి.రమణారావు గురువారం పర్యటించి వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా తెగుళ్ల వ్యాప్తిని గుర్తించి, నివారణ సూచనలు చేశారు. యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వారి వెంట వ్యవసాయశాఖ సచివాలయ సహాయకురాలు షేక్ నసీమా, పలువురు అభ్యుదయ రైతులు ఉన్నారు.

## త్వరలో కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు

**చింతలపూడి, న్యూస్‌టుడే:** నిర్దిష్ట సమయంలో ప్రతీ దరఖాస్తును పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో 'ప్రజలతో ఎమ్మెల్యే-ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయనుందన్నారు. అర్హులకు అవి చేరాలన్నారు. ప్రజల నుంచి మొత్తం 691 దరఖాస్తులు వచ్చాయన్నారు.



లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న రోషన్‌కుమార్

## కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే

**పోలవరం, న్యూస్‌టుడే:** సత్యసాయి మంచినీటి పథకం కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. పలు మండలాలకు చెందిన సత్యసాయి మంచినీటి పథకం నిర్వహణ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి బకాయిలు సత్వరం చెల్లించేలా, క్రమం తప్పకుండా వేతనాలు వచ్చేలా చూడాలని కోరుతూ గురువారం వినతిపత్రం అందజేశారు. యూనియన్ ప్రతినిధులు ప్రసాద్, సత్యనారాయణలు పాల్గొన్నారు.



బాలరాజుకు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు



బొరగం దంపతులను సత్కరిస్తున్న గ్రామస్థులు, ఉద్యోగులు

## ఉపాధి, ఉద్యోగాల కల్పనకు కృషి

**పోలవరం, న్యూస్‌టుడే:** రాష్ట్ర ట్రైకార్ సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బొరగం శ్రీనివాసులు అభినందన సభ నిర్వహించారు. ఆయన స్వగ్రామం మామిడిగొందికి గురువారం వచ్చిన సందర్భంగా పూల వర్షం కురిపిస్తూ ఉద్యోగులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా బొరగం మాట్లాడుతూ యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేయడంతో పాటు గ్రామాభివృద్ధికి పాటు పడతానన్నారు. గ్రామస్థులతో పాటు వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు, పార్టీల కతీతంగా గిరిజన సర్పంచులు, మాజీ సర్పంచులు కార్యక్రమానికి విచ్చేసి శ్రీనివాసులు దంపతులను సత్కరించారు. బొరగం ధనరాజ్, రెడ్డిదొర, గురుజు రాజు, కురంశెట్టి వెంకటేశ్వరరావు, మిడియం వీరరాఘవులు, కలుం బోడయ్య తదితరులు పాల్గొన్నారు.

## నాసిరకంగా ఆసుపత్రి పనులు

**చింతలపూడి, న్యూస్‌టుడే:** చింతలపూడి వంద పడకల ఆసుపత్రి పనులను గుత్తేదారు అత్యంత నాసిరకంగా చేస్తున్నారని జనసేన మండల అధ్యక్షుడు చీదరాల మధుబాబు ఆరోపించారు. వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను కూటమి నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ పంట పొలాల నుంచి తెచ్చిన ఇసుకను నిర్మాణ పనులకు వినియోగిస్తున్నారన్నారు. ఈ విషయమై గతంలో గుత్తేదారును హెచ్చరించినా అదే ఇసుకతో నిర్మాణ పనులు చేపడుతుండటం దారుణమన్నారు. ఆయనతో పాటు తెదేపా, జనసేన నాయకులు పాల్గొన్నారు.



ఇసుకను పరిశీలిస్తున్న కూటమి నాయకులు

## బాగు చేయించండి.. సేవలందిస్తా!



**కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** పరింపూడి పంచాయతీలో చెత్త సేకరణ కోసం గత పాలకవర్గం సమయంలో సమకూర్చిన మినీ ట్రాక్టరు, ట్రక్కు సుమారు నాలుగేళ్లుగా మరమ్మతులకు గురై పక్కన పడి ఉంది. పట్టించుకునే నాథుడు లేక ఎండకు ఎండి, వానకు తడుస్తూ విడి భాగాలు పాడవుతున్నాయి. రెండేళ్ల కిందట దాతల విరాళాలతో సమకూరిన ట్రాక్టరు, స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమంలో సమకూరిన వాహనాన్ని ప్రస్తుతం పారిశుద్ధ్య పనులకు వినియోగిస్తున్నారు. ఈ వాహనం కూడా అందుబాటులోకి వస్తే చెత్త సేకరణకు మరింత వెసులుబాటు కలుగుతుంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి కె.సురేశ్ మాట్లాడుతూ పాడైన మినీ ట్రాక్టరు, ట్రక్కులకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెస్తామని చెప్పారు.

## కుంగిన చప్టా.. రాకపోకలకు అవస్థ



**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** బుట్టాయగూడెం మండలం అలివేరు వద్ద లంకపాకల మార్గంలో బండిరెడ్డి వాగుపై చప్టా కుంగి వాహన చోదకులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. లంకపాకల, రేగులపాడు, రేపల్లి, డోలుగండి, మోదెల గ్రామాలకు ఇదే ప్రధాన మార్గం. చప్టా కుంగిన ప్రదేశంలో తూరలు పగిలిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. ఐటీడీఏ అధికారులు పట్టించుకుని సత్వరమే సమస్యను పరిష్కరించాలని అలివేరు సర్పంచి కారం లక్ష్మి, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు రాఘవ కోరారు.

## సారా పట్టివేత

**కొయ్యలగూడెం, న్యూస్‌టుడే:** అంకాలగూడెంలో 50 లీటర్ల నాటుసారా రవాణా చేస్తున్న గోకవరపు టైసన్, చింతలపూడి అశోక్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపారు.



అశ్వారావుపేట రోడ్డులో వాహన వెలుగులే దిక్కు

## వెలగని దీపాలు.. చీకట్లో రాకపోకలు!

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** పట్టణంలో వీధి దీపాల నిర్వహణ సక్రమంగా లేదు. స్థానిక అశ్వారావుపేట రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు రాత్రయితే చాలు చీకటిమయంగా ఉంటోంది. వాహనాల వెలుగుల్లోనే ప్రజలు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. తెల్లవారుజామున నడకకు వెళ్లే వారు బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. ఏలూరు రోడ్డులో సైతం పలు చోట్ల దీపాలు వెలగడం లేదంటున్నారు. దీనిపై పురపాలక కమిషనర్ కేవీ రమణ మాట్లాడుతూ మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

# కూలేలా భవనాలు.. పశువైద్యానికి తంటాలు!

**బుట్టాయగూడెం, టి.నరసాపురం, న్యూస్‌టుడే:** మూగజీవాలకు వైద్య సేవలు అందించే భవనాలు నేడు ఏ నిమిషంలో కూలతాయో తెలియని పరిస్థితిలో ఉన్నాయి. వాటిలోనే వైద్య సిబ్బంది భయాందోళనతో చికిత్సలు చేస్తున్నారు. సుమారు 40 ఏళ్ల కిందట నిర్మించిన ఈ భవనాల్లో కొన్ని గోడలు పగిలి, ఇంకొన్ని పైభాగం పెచ్చులూడి, మరికొన్ని కూలేలా ఉన్నాయి.

వీటిలో దాదాపు 80కి పైగా నేడు శిథిలావస్థకు చేరాయి. వాటి పరిధిలో ఉన్న ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు తరచూ వైద్య సేవలందించాల్సి వస్తోంది. అవికాక, పందులు, కుక్కలు, కోళ్లు, వంటి వాటికి కూడా ఇక్కడ వైద్య సేవలందిస్తున్నారు. వీటికి వైద్యం అందించడం కోసం దాదాపు వైద్య సిబ్బంది, మందులు అందుబాటులో ఉన్నా, సరైన వైద్యశాలలు లేవు.



టి.నరసాపురం పశువైద్య కేంద్రంపై కప్పిన బరకం

**జిల్లాలో ఇలా..**

| | |
|---|---|
| ప్రాంతీయ పశు వైద్య కేంద్రాలు: | 11 |
| పశువైద్య: | 66 |
| గ్రామీణ: | 57 |

**ఏళ్లు దాటింది**

పశు వైద్యశాలల్లో సిబ్బంది, పశు పోషకులు కూర్చునేందుకు అవసరమైన సామగ్రి అందజేసి 20 ఏళ్లు దాటింది. శస్త్ర చికిత్సకు అవసరమైన (అభిలాష కిట్) పరికరాలు అందించి దాదాపు 10 ఏళ్లు దాటింది. దీంతో వైద్యులు పశువులకు శస్త్రచికిత్సలు చేయడంతో ఇబ్బందులకు గురవుతున్నారు.

**భయంగా ఉంది**



'మా గ్రామంలో పశు వైద్యశాలకు వెళ్లాలంటేనే భయంగా ఉంది. ఆ భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. భవనంపై బరకం కప్పి వైద్యులు సేవలందిస్తున్నారు'అని టి.నరసాపురానికి చెందిన పశుపోషకుడు దేవరపల్లి రంగారావు తెలిపారు.

**వైద్యం అందించాల్సిన పశువులు (2019 గణన ప్రకారం)**

| | |
|---|---|
| ఆవులు,ఎద్దులు | 44,218 |
| గేదెలు | 2,54,774 |
| గొర్రెలు | 1,46,779 |
| మేకలు | 69,720 |
| పందులు | 1,076 |
| కుక్కలు | 11,668 |

**దఫదఫాలుగా భవన నిర్మాణాలు**

'శిథిలావస్థకు చేరిన పశువైద్యశాలల భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వం దఫదఫాలుగా నిధులు మంజూరు చేయనుంది. వాటి ద్వారా ప్రాధాన్య క్రమంలో భవన నిర్మాణాలు, వాటిలో అవసరమైన సౌకర్యాలు కల్పిస్తాం'అని ఏలూరు పశుసంవర్ధక శాఖ జేడీ జి.నెహ్రూబాబు తెలిపారు.

# మహా కనకదుర్గా.. విజయ కనకదుర్గా..!



దుర్గాదేవిగా జంగారెడ్డిగూడెం ముత్యాలమ్మ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఎనిమిదో రోజు గురువారం అమ్మవార్లు దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు సారె సమర్పించారు. కుంకుమ పూజలు, ప్రత్యేక అభిషేకాలు చేశారు. పలుచోట్ల బతుకమ్మలను ఏర్పాటు చేసి ఆడారు. నిప్పులగుండం తొక్కారు. కోలాట నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. -న్యూస్‌టుడే, బృందం



ద్వారకా తిరుమల కుంకుళ్లమ్మ



రౌతుగూడెంలో కనకదుర్గమ్మను దర్శించుకుంటున్న భవానీలు



బుట్టాయగూడెంలో సామూహిక కుంకుమ పూజలు



గ్రామ దేవత గంగానమ్మ



నూకాలమ్మ



బయ్యనగూడెంలో..



జంగారెడ్డిగూడెం కన్యకా పరమేశ్వరికి 108 రకాల పిండి వంటలతో సారె



కుక్కునూరులో బతుకమ్మ నిమజ్జనానికి తరలింపు

## మద్యం సీసాలు స్వాధీనం

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** స్థానిక పాతబస్టాండ్ వద్ద బెల్టు దుకాణం నిర్వహిస్తున్న మన్యం దుర్గారావును అదుపులోకి తీసుకుని రూ.11,660 విలువైన 79 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జబీర్ తెలిపారు.

## కలప ట్రాక్టర్లు..

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** అనుమతి లేకుండా కలప తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను డీఎస్పీ యు.రవిచంద్ర గురువారం పట్టుకున్నారు. గాలాయిగూడెం పరిసర ప్రాంతాల నుంచి బుట్టాయగూడెం వైపు వెళుతుండగా జంగారెడ్డిగూడెంలో స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు డీఎస్పీ చెప్పారు. వాహనాల చోదకులకు కౌన్సెలింగ్ ఇచ్చి.. జరిమానాలు విధించినట్లు వెల్లడించారు.

## జూద స్థావరంపై దాడి

**చింతలపూడి, న్యూస్‌టుడే:** యర్రంపల్లిలో జూద స్థావరంపై దాడి చేసి రూ.3700 స్వాధీనం చేసుకుని, అయిదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై కుటుంబరావు తెలిపారు.

# రెండంతస్తులు.. నాలుగేళ్లుగా నిర్మాణం!



**పోలవరం, న్యూస్‌టుడే:** నాబార్డు నిధులు రూ.5.15 కోట్లతో పోలవరంలో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం 2020లో ప్రారంభించారు. ఈ రెండు అంతస్తుల కట్టడం 2022 నాటికి పూర్తికావాలి. ఇంకా ప్లాస్టింగ్, సీలింగ్, విద్యుత్తు, నీటి సదుపాయం, ఫ్లోరింగ్, కిటికీలు, గుమ్మాల పనులు పూర్తి చేసి, రంగులు వేయాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి బిల్లులు రావడం లేదన్న కారణంగా గత ప్రభుత్వ హయాంలో గుత్తేదారుడు పనులు నిలిపేశాడు. నిర్మాణం పూర్తికాకముందే ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలు తీసుకొచ్చి పాత భవనంలో ఉంచారు. దీంతో రోగులతో పాటు వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం 13 పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, మరో ఇద్దరు రోగులు పెరిగితే ఏం చేయలేని నిస్సహాయ స్థితిలో వైద్యులున్నారు. దీనిపై పనులు పర్యవేక్షిస్తున్న మెడికల్ సర్వీసెస్ మౌలిక సదుపాయాల కల్పన అభివృద్ధి సంస్థ ఏఈ రామాంజనేయులు మాట్లాడుతూ బిల్లులు మంజూరు కాకపోవడంతో గుత్తేదారుడు పనులు నిలిపివేసినట్లు చెప్పారు.

## ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

**దేవరపల్లి, న్యూస్‌టుడే:** ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో మెనేజర్‌గా పని చేస్తున్న వ్యక్తి ఆర్థిక లావాదేవీలతో మనస్తాపానికి గురై కలుపు నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. దేవరపల్లి మండలం సంగాయిగూడేనికి చెందిన దంపనబోయిన శివ(32) జంగారెడ్డిగూడెంలో నివాసం ఉంటూ ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో కొంత కాలంగా పనిచేస్తున్నారు. ఈ నెల 8న రుణాల వసూలు నిమిత్తం సంగాయిగూడెం వచ్చి తన నివాసంలో ఆ రాత్రి నిద్రపోయారు. 9వ తేదీ తెల్లవారుజామున వాంతులు అవడంతో ఆయన తల్లి, బంధువులు హుటాహుటీన నిడదవోలులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కలుపు నివారణ మందు తాగినట్లు వైద్యులు గుర్తించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. మృతుడి తల్లి పెద్దింట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు.



శివ(పాత చిత్రం)

నూజివీడు
• నూజివీడు • కైకలూరు

## వైభవంగా గంగానమ్మ జాతర



**నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉన్న గంగానమ్మ ఆలయంలో జాతర గురువారం వైభవంగా నిర్వహించారు. గడిచిన 40 ఏళ్లుగా గంగానమ్మ జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు. భక్తులు స్థానిక కోట మహిషాసురమర్దని అమ్మవారి ఆశీస్సులు తీసుకుని, అమ్మవారికి సారె సమర్పించారు. బొందిలిపేటలోనూ గంగానమ్మ జాతర నిర్వహించారు. రెండు చోట్ల అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ నిర్వాహకుడు మల్లిశెట్టి బాబీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## పంటుపై డ్రెయిన్‌లో పూడికతీత



నాగభూషణపురం వద్ద పనులు చేస్తున్న భారీ యంత్రం

**మండవల్లి, న్యూస్‌టుడే:** మోటూరు ఎల్ ఎస్ డ్రెయిన్‌లో కిక్కిస, గుర్రపు డెక్క తీత పనులు జోరుగా సాగుతున్నాయి. 20 కిలోమీటర్లు ప్రయాణించే ఈ డ్రెయిన్ పనులను గత 15 ఏళ్లలో ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో పెద్దఎత్తున చెత్త, గుర్రపు డెక్క, కిక్కిస, ముళ్ల పొదలతో దారుణంగా తయారయ్యింది. చిన్నపాటి వర్షానికి సైతం నీళ్లు రోడ్డుపై పారుతున్నాయి. దీంతో పనులు చేసేందుకు ప్రత్యేకంగా పంటు ఏర్పాటు చేశారు. 10 టన్నులు సామర్థ్యం కలిగిన పంటుపై 7 టన్నుల బరువు ఉండే పొక్లెయిన్‌ను ఇనుప గొలుసులతో కట్టి ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్న డ్రైవర్‌తో డ్రెయిన్ మధ్యలో నుంచే కిక్కిస, తూడు తొలగించేలా చర్యలు చేపట్టారు. డ్రెయిన్ పూడిక పనులు చేపట్టడంతో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌ను నాయకులను రైతులు అభినందిస్తున్నారు.

## అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



విచారిస్తున్న శ్రావణ్‌కుమార్

**మండవల్లి, న్యూస్‌టుడే:** మండవల్లి మండలం చావలిపాడు గాంధీనగర్‌లో కులం పేరుతో దూషించిన ఘటనపై నమోదైన అట్రాసిటీ కేసుపై డీఎస్పీ శ్రావణ్‌కుమార్ బుధవారం రాత్రి విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన విసన్నపల్లి మేరీ, భర్త వెంకటేశ్వరరావును ఇంటి పక్కనున్న మహమ్మద్ అబ్దుల్ గఫార్, అతని కుటుంబ సభ్యులు కులం పేరుతో దూషించడంతో ఈనెల 8న కేసు నమోదైంది. దీనిపై క్షేత్రస్థాయిలో డీఎస్పీ బాధితులను విచారించి వివరాలు సేకరించారు. కైకలూరు గ్రామీణ సీఐ రవికుమార్, మండవల్లి ఇన్‌ఛార్జి ఎస్సై రాంబాబు సిబ్బంది పాల్గొన్నారు.

# పల్లె మురిసేలా.. ప్రగతి విరిసేలా!

### సీసీ రోడ్లు, డ్రెయినేజీ వసతుల కల్పనకు శ్రీకారం

**కైకలూరు, న్యూస్‌టుడే:** వైకాపా ప్రభుత్వం గడిచిన అయిదేళ్ల అసమర్థ పాలనతో గ్రామ స్వరాజ్యం అంటూ గొప్పలు పలికి గ్రామాలను అథోగతి పాలు చేసింది. పట్టుమని పది సిమెంటు రోడ్లు వేసిన పాపాన పోలేదు. దీంతో దేశానికి పట్టు కొమ్మలైన పల్లెలు అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సారి గ్రామ సభలు నిర్వహించి చరిత్ర సృష్టించారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనుల వివరాలు నేరుగా వారి ద్వారానే సేకరించారు.

**నియోజకవర్గంలో ఇలా**

| మండలం | పనులు | సీసీ రోడ్లు (మీటర్లలో) | డ్రెయినేజీలు (మీటర్లలో) | నగదు (రూ.లక్షల్లో) |
|---|---|---|---|---|
| కైకలూరు | 66 | 5421 | 1110 | 431.49 |
| కలిదిండి | 56 | 6630 | 200 | 523.26 |
| మండవల్లి | 71 | 5530 | 1335 | 452.80 |
| ముదినేపల్లి | 83 | 5729 | 3356 | 509.58 |
| మొత్తం | 276 | 23310 | 6001 | 1917.13 |

**14 నుంచి పల్లె పండగ**

గ్రామ సభల ద్వారా గుర్తించిన అభివృద్ధి పనులకు తీర్మానాలు చేయించి సత్వరంగా చేపట్టేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. వీటి కోసం ఉపాధి హామీ నిధులతో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగిస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్లు పనులకు అనుమతులు మంజూరు చేశారు. ఈనెల 14 నుంచి పల్లె పండగ పేరుతో గ్రామాల్లో సిమెంటు రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ, తారు రోడ్ల నిర్మాణం, పశువులకు మినీ గోకులాలు, ఇంకుడు గుంతలు, తాగునీటి వసతులు కల్పించనున్నారు. అక్టోబరు 20 వరకు నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యేలతో పాటు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తున్నారు.

**ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు**

పల్లె పండగలో భాగంగా కైకలూరు నియోజకవర్గంలోని 110 గ్రామ పంచాయతీల్లో 23,310 మీటర్ల సీసీ రోడ్లు, 6,001 మీటర్ల డ్రెయినేజీల నిర్మాణాలతో రూ.1917.13 లక్షల విలువైన 276 పనులు చేపట్టనున్నారు. ఈనెల 14న ప్రజాప్రతినిధులతో శంకుస్థాపన నిర్వహించి సంక్రాంతి నాటికి నూరుశాతం పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు రావాలనే ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు.

**అభివృద్ధే ధ్యేయంగా పాలన**

అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్నాం. పల్లెలు సస్య శ్యామలంగా ఉండేలా ప్రతి ఊరిలో సిమెంటు రోడ్లు, మౌలిక వసతులు కల్పిస్తున్నాం. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా మారుస్తాం.
- కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్యే



**నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే**

**సమస్య:** నూజివీడు ఏరియా ఆసుపత్రి సమీపంలో వర్షానికి పెద్ద గొయ్యి పడింది. - శ్రీనివాసరావు, నూజివీడు

**సమాధానం:** గొయ్యి పూడ్చేలా చర్యలు తీసుకుంటాం. - లక్ష్మీనారాయణ, మున్సిపల్ డీఈ

**కైకలూరు, న్యూస్‌టుడే**

**సమస్య:** మండలంలోని తామరకొల్లు ఎంపీపీ పాఠశాలకు వెళ్లే రహదారిపై మురుగు నీరు ప్రవహిస్తోంది. విద్యార్థులతో పాటు స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. - సంపత్, తామరకొల్లు

**సమాధానం:** డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరిచి మురుగునీరు మళ్లించేలా చర్యలు తీసుకుంటాం. - రవికిరణ్, పంచాయతీ కార్యదర్శి

**చాట్రాయి, న్యూస్‌టుడే**

**సమస్య:** పోలవరం- చింతలపూడి మార్గంలో పోతనపల్లి స్టేజీ వద్ద ఇటీవల భారీ వర్షాలకు రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే యత్నంలో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. - యర్రా హేమంత్‌కుమార్, పోలవరం

**సమాధానం:** త్వరలోనే రహదారిని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయనున్నాం. ఇక్కడ కూడా ప్రమాద నివారణ చర్యలు చేపడతాం. - సీహెచ్.బాబూరావు, డీఈ, ర.భ శాఖ, నూజివీడు

**కలిదిండి, న్యూస్‌టుడే**

**సమస్య:** కోటకలిదిండి ప్రధాన మార్గంలో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. రాత్రి వేళల్లో ఇబ్బందిగా ఉంటుంది. - నాగేశ్వరరావు, కోటకలిదిండి

**సమాధానం:** పని చేయని దీపాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. - ఉదయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి



మాట్లాడుతున్న న్యాయమూర్తి లక్ష్మి

## మానసిక ప్రశాంతతతో ఒత్తిడి దూరం

**కైకలూరు, న్యూస్‌టుడే:** మారుతున్న జీవన చక్రంతో మానవుడు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాడని, మానసిక ప్రశాంతతతో ఒత్తిడిని నివారించొచ్చని కైకలూరు సివిల్ కోర్టు సీనియర్ న్యాయమూర్తి వీవీఎస్‌వీ లక్ష్మి అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని సీతనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మానసిక సమస్యలతో ఇబ్బందులు పడే వ్యక్తులు దాడులు చేసినా.. ఇబ్బందులకు గురి చేసినా చట్టరీత్యా శిక్షార్హులు అవుతారన్నారు. న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం ఆసుపత్రిని సందర్శించి ప్రాంగణంలో మొక్కలు నాటారు. వైద్యురాలు అన్నపూర్ణ, న్యాయవాదులు దేవరపల్లి శివప్రసాద్, జయప్రకాష్, ప్రసన్నకుమార్, గ్రామస్థులు కాజ రమేష్ చంద్రబాబు, కృష్ణకుమార్, పాండురంగారావు, ఆసుపత్రి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# కరుణించుమా.. కనకదుర్గ



భైరవపట్నంలో పూజలు చేస్తున్న భక్తులు

**న్యూస్‌టుడే, బృందం:** దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా గురువారం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. కైకలూరు శ్యామలాంబ వారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. వావిలి కన్యకాపరమేశ్వరి అమ్మవారు దుర్గామాతగా అలంకరించారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మకు విశేష పూజలు చేశారు. వరహాపట్నంలోని భూసమేత లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో అమ్మవారు రాజ్యలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ఆగిరిపల్లి వరాహ పుష్కరిణి సమీపంలోని బాలా త్రిపుర సుందరి సమేత ముక్తేశ్వర స్వామి ఆలయంలో లక్ష్మీ గణపతి హోమం, చండీ హోమం, కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారు కనకదుర్గాదేవిగా దర్శనమిచ్చారు. కొండంగిలో కనకదుర్గమ్మ దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. కోరుకొల్లు సోమేశ్వరాలయంలో పార్వతీమాతకు కుంకుమ పూజ చేశారు. దేవపూడిలో విజయదుర్గాదేవి కాళికాదేవిగా, అల్లూరులోని రేణుకా ఎల్లమ్మ తల్లి, వణుదుర్రులో వీర అంకమ్మ తల్లి దుర్గాదేవిగా, గుడిలూరులోని పార్వతీదేవి కనకదుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భైరవపట్నం రామాలయం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారికి కుంకుమ పూజలు జరిపించారు. లోకుమూడి దత్తాశ్రమంలో దుర్గాదేవిని అలంకరించారు. ఇంగిలిపాకలంక శివ గుత్కలమ్మను దుర్గాదేవిగా అలంకరించి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ముసునూరు మండలం బలివేలో రాజరాజేశ్వరీదేవి దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. నూజివీడు కోట మహిషాసురమర్దని అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు.



గోనెపాడులో విజయ దుర్గాదేవి



కొండంగిలో..



దేవపూడిలో కాళికాదేవి



నూజివీడు: దుర్గాదేవి



ఆగిరిపల్లిలో..



ముసునూరులో..

## ఫ్యూజ్ బాక్సులు సరిచేశారు

**ఈనాడు కథనానికి స్పందన**

**ముసునూరు, న్యూస్‌టుడే:** ముసునూరు మండలం రమణక్కపేట సెంటర్‌లో, చెక్కపల్లి రామాలయం వెనుక అంగన్‌వాడీ కేంద్రం ఎదురుగా విద్యుత్తు నియంత్రిక వద్ద ఫ్యూజ్ బాక్సులు ప్రమాదకరంగా ఉన్నాయి. దీనిపై గురువారం 'ఈనాడు'లో 'చేతికందే ఎత్తులో ప్రమాదం' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి విద్యుత్తు అధికారులు స్పందించారు. ఫ్యూజ్ బాక్సులను సరిచేసి ప్రమాదాలను నివారించారు.

## పాల ఉత్పత్తి దారులకు బోనస్ పంపిణీ

**నూజివీడు, న్యూస్‌టుడే:** వెంకటాద్రిపురంలో కృష్ణామిల్క్ యూనియన్ మహిళా పాల ఉత్పత్తిదారుల సంఘంలో పాలు పోస్తున్న ఉత్పత్తిదారులకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి బోనస్ రూ.2,48,212 సంఘ అధ్యక్షురాలు కనగల వెంకట శివ జ్యోతి గురువారం రాత్రి అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ మాగంటి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## అవకాశాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న న్యాయమూర్తి పెద్దఖాసిం

**నూజివీడు, న్యూస్‌టుడే:** ఆధునిక పోటీ ప్రపంచంలో మనిషి నిత్యం ఆర్థిక, సామాజిక, శారీరిక ఇలా వివిధ కారణాలతో ఒత్తిడికి గురై మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారని.. ప్రతి ఒక్కరు ప్రణాళికతో ముందుకు వెళ్తే ఒత్తిడిని జయించి.. సమస్యను తరిమేయొచ్చని సీనియర్ సివిల్ జడ్జి పెద్ద ఖాసిం అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మానసిక ఒత్తిడికి గురి కావొద్దని.. ప్రభుత్వ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. న్యాయవాది గోపి, ఆసుపత్రి సూపరింటెండెంట్ నరేంద్ర సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## మాంసం దుకాణాలు తొలగించాలని వినతి

**ముసునూరు, న్యూస్‌టుడే:** ముసునూరు మండలం రమణక్కపేట పరిధిలోని కండ్రికలో వ్యాపారులు ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపట్టి మాంసం దుకాణాలు ఏర్పాటు చేసిన వాటిని తొలగించాలని ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి గరికే అఖిల్ గురువారం ఎంపీడీవో జి.రాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిల్ మాట్లాడుతూ.. ఆ గ్రామంలో మాంసం దుకాణాలు ఏర్పాటు చేసే ప్రాంతానికి సమీపంలో మంచినీటి బోరు ఉందని, దీంతో వ్యర్థాలు తాగునీటిలో కలుస్తున్నాయన్నారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు గణేశ్, నాగరాజు, ఏసు, కిరణ్ పాల్గొన్నారు.

# ఆక్రమించి.. అవస్థలు మిగిల్చి!

- ★ నిర్లక్ష్యం చేసిన గత వైకాపా ప్రభుత్వం
- ★ ఎమ్మెల్యే చొరవతో ఆక్రమణదారులకు నోటీసులు



మురుగు కాలువపై ఏర్పాటు చేసిన అల్పాహారశాల

**ముదినేపల్లి, న్యూస్‌టుడే:** మురుగు కాలువల వ్యవస్థను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ముదినేపల్లి నుంచి పెయ్యేరు, వడాలి వరకు మురుగును ఢాకేరు కాలువలో కలిపే మురుగు కాలువ రూపు కోల్పోయింది. ప్రధాన రహదారి వెంబడి ఉన్న ఈ కాలువను ఎక్కడికక్కడ ఆక్రమించుకుని నిర్మాణాలు చేయడంతో మురుగు పారక, చిన్న వర్షం పడినా నివాసాలు, పొలాలు నీట మునుగుతున్నాయి. దీనిపై గతంలో అనేక సార్లు స్థానికులు ఆందోళన చేసినా.. వినతిపత్రాలు అందించినా పట్టించుకోలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పొలాలు నీట మునిగాయి. స్థానిక రైతులు సమస్యను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లడంతో అధికారులు ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశారు. ఇప్పటికైనా ఆక్రమణలు తొలగించి మురుగు సమస్య పరిష్కారమవుతుందని స్థానికులు, రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**యథేచ్ఛగా నిర్మాణాలు**

కాలువను ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణాలు చేశారు. దుకాణాలను సైతం ఏర్పాటు చేసినా అప్పటి అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో అధికారులు పట్టనట్లు వ్యవహరించారు. దీంతో స్థానిక ప్రజాప్రతినిధులు సైతం కాలువపై షెడ్లు, దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే గతేడాది పెయ్యేరు పరిధిలో కాలువపై ఏర్పాటు చేసిన ఓ హోటల్‌ను మాత్రం అధికారులు బలవంతంగా పొక్లెయిన్‌తో తొలగించారు. బాధితుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించినా అది తొలగించాలని ఆదేశాలు ఇవ్వడంతో తొలగించారు. మరి మిగతా వాటికి అది ఎందుకు వర్తింపజేయడం లేదనే దానికి అధికారుల వద్ద సమాధానం లేదు.

**వడాలి వారికే..**

మురుగు కాలువ ఆక్రమణలు తొలగించాలని ఎమ్మెల్యే ఆదేశాలతో వడాలి పంచాయతీ ఆధ్వర్యంలో సుమారు 30 మందికి నోటీసులు జారీ చేశారు. మరి పెయ్యేరు పరిధిలో వారికి ఒక్క నోటీసు సైతం జారీ చేయకపోవడం గమనార్హం. దీనివల్ల సగం తొలగించి, సగం వదిలేస్తే ప్రయోజనం ఏమీ ఉండదని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెయ్యేరు పరిధిలో ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి కాలువ ప్రక్షాళన చేయాలని కోరుతున్నారు.

**ప్రణాళిక రూపొందిస్తున్నాం..**

మురుగు కాలువకు సంబంధించి పెయ్యేరు పరిధిలోని ఆక్రమణలు మా దృష్టికి వచ్చాయి. వివరాలు సేకరిస్తున్నాం. త్వరలోనే నోటీసులు జారీ చేసి వాటిని తొలగింపు చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం.
- జి.రమేశ్, పంచాయతీ కార్యదర్శి, పెయ్యేరు

## ముగిసిన రెండో విడత శిక్షణ

**ముదినేపల్లి, న్యూస్‌టుడే:** స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు నిర్వహిస్తున్న రెండో విడత శిక్షణ గురువారంతో ముగిసింది. ఎంపీడీవో రామకృష్ణ మాట్లాడుతూ.. రెండు విడతలు రెండ్రోజుల చొప్పున నిర్వహించిన శిక్షణలో మెరుగైన పాలన అందించాలన్నారు. సాధారణ పరిపాలన విధానం, పంచాయతీరాజ్ చట్టం 1994 నిబంధనలు తప్పనిసరిగా అవలంబించాలని సూచించారు.

## వెండి వితరణ



**చాట్రాయి, న్యూస్‌టుడే:** ఆరుగొలనుపేటలోని లక్ష్మమ్మ, అంకమ్మ అమ్మవార్లకు కుంట ముక్కల వెంకట అప్పారావు కుటుంబ సభ్యులు వెండి చెరారి, పళ్లెం వితరణగా అందించారు. ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలనంతరం వాటిని అందజేశారు.



వినోద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

## బాధ్యతల స్వీకరణ

**ముదినేపల్లి, న్యూస్‌టుడే:** రాష్ట్ర పర్యాటక అభివృద్ధి శాఖ డైరెక్టరుగా ముదినేపల్లికి చెందిన కొడాలి వినోద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడలోని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయనను ఆ శాఖ ఛైర్మన్ కాసగాని బాలాజీ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. పర్యాటకాభివృద్ధి శాఖ మంత్రి కందుల దుర్గేశ్ వినోద్‌ను చరవాణిలో అభినందించినట్లు ఆయన తెలిపారు.

## రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటు

**కైకలూరు, న్యూస్‌టుడే:** భారత పారిశ్రామిక దిగ్గజం, టాటా సన్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, తెదేపా నేత బీదా మస్తాన్‌రావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులతో కలిసి రతన్‌టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎందరో యువ పారిశ్రామికవేత్తలకు టాటా ఆదర్శప్రాయుడని కొనియాడారు. ప్రపంచంలోని పలు దేశాల్లో సంస్థలు స్థాపించి ఎందరో నిరుద్యోగులకు ఉపాధి కల్పించారన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కామినేని, మస్తాన్‌రావు, కూటమి నాయకులు

## ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

**కైకలూరు, న్యూస్‌టుడే:** ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పొన్నూరు గౌతమ్‌రెడ్డి విజయానికి వైకాపా శ్రేణులు కృషి చేయాలని వైకాపా జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు రైల్వేస్టేషన్ రోడ్డులోని వైకాపా కార్యాలయంలో ఎమ్మెల్సీ అభ్యర్థితో కలిసి గురువారం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. డిగ్రీ పూర్తి చేసిన వారందరిని ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. అనంతరం రతన్ టాటా మృతికి సంతాపం వ్యక్తం చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## 'రాహుల్ ప్రధాని కావడం ఖాయం'

**నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే:** ప్రధాని నరేంద్ర మోదీ ఎప్పటికీ విశ్వ గురువు కానే కాదని విష పురుగని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోళ్ల పవన్ కుమర్ అన్నారు. నూజివీడులో ఆయన గురువారం మాట్లాడుతూ.. తాజాగా వెలువడిన ఎన్నికల ఫలితాలతో భాజపాకి చావు తప్పి కన్ను లొట్టపోయిందన్నారు. మోదీ అరాచకాలతో దేశంలోని అన్ని వర్గాల ప్రజలు విసుగు చెందారని, రానున్న 2029 ఎన్నికల్లో గెలిచి రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయం అన్నారు.

## పునాదుల్లో పిచ్చి మొక్కలు



పోలవరంలో ఆరోగ్య కేంద్ర భవనం

**చాట్రాయి, న్యూస్‌టుడే:** పోలవరం సచివాలయంలో మంజూరు చేసిన రైతు సేవా, ఆరోగ్య కేంద్రాల నిర్మాణ పనులు పునాదుల్లోనే నిలిచాయి. ప్రజలకు వైద్య సేవలు మరింత అందుబాటులోకి, రైతులకు చేరువలో ఆధునిక వ్యవసాయ సలహాలు అందిస్తామని గత ప్రభుత్వం గొప్పలు చెబుతూ వీటి నిర్మాణాలు చేపట్టింది. నిర్మాణ పనులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో వీటి పనులు గుత్తేదారులు సగంలోనే వదిలేశారు. ప్రస్తుతం అద్దె భవనాల్లో ఆయా శాఖల సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. పనుల కొనసాగించడంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఏఈ కృష్ణ తెలిపారు.



రైతు సేవా కేంద్రం ఇలా..

### సినిమాలు

**నూజివీడు పట్టణం**

| | |
|---|---|
| సత్యనారాయణ | దేవర |
| సత్యనారాయణ మినీ | జోకర్ |
| ద్వారక సినిమాస్ స్క్రీన్ 1 | దేవర |
| ద్వారక సినిమాస్ స్క్రీన్ 2 | సత్యం సుందరం |
| ద్వారక సినిమాస్ స్క్రీన్3 | దక్షిణ |
| **ఆగిరిపల్లి:** శ్రీఅను డీలక్స్ | దేవర |
| **కైకలూరు** | |
| విజయలక్ష్మి జీ3 సినిమాస్ | దేవర |
| మాగంటి సినిమాస్ | వెట్టయన్ |
| శ్రీవెంకటరమణ సినిమాస్ | విశ్వం |
| **ముదినేపల్లి:** పూర్ణిమ | దేవర |


## రూ.లక్షలు వెచ్చించారు.. నిరుపయోగంగా మార్చారు!



ముసునూరు తహసీల్దార్ కార్యాలయంలో జనరేటర్

ముసునూరు తహసీల్దార్ కార్యాలయంలో జనరేటర్ నిరుపయోగంగా మారింది. విద్యుత్తు కోతల సమయంలో కార్యాలయాల్లో పనులకు ఆటంకం కలగకుండా కొన్నేళ్ల కిందట జనరేటర్లను సమకూర్చారు. అయితే అధికారుల నిర్లక్ష్యంతో పాటు పర్యవేక్షణ లేకపోవడంతో జనరేటర్‌ను వినియోగంలోకి తీసుకురాలేదు. తరచూ విద్యుత్తు కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం దీనికి షెడ్డు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ పెట్టిన చోటే తుప్పు పట్టి దర్శనమిస్తోంది. యంత్రాన్ని వినియోగంలోకి తీసుకొస్తే అత్యవసర సమయంలో ఇబ్బందులు ఉండవని పలువురు చెబుతున్నారు. ఈ విషయమై ఇన్‌ఛార్జి తహసీల్దార్ జీపీ శర్మ మాట్లాడుతూ.. 'విద్యుత్తు కోతల సమయంలో సేవలకు అంతరాయం లేకుండా ఇన్వర్టర్ ఏర్పాటు చేశాం. జనరేటర్ల పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం'. అని తెలిపారు.
- న్యూస్‌టుడే, ముసునూరు

## కంచె లేక రక్షణ కరవై!



చాట్రాయి ప్రధాన రహదారిలో రక్షిత మంచి నీటి పథకం పక్కనే విద్యుత్తు నియంత్రిక చుట్టూ రక్షణ కంచె లేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ఈ మార్గంలో నిత్యం వ్యవసాయదారులు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఎప్పుడు ఎం జరుగుతుందోనని పలువురు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడే విద్యుత్తు తీగలు వెళ్లే స్తంభాలపై తీగలు అల్లుకుపోతున్నాయి. వీటితో గాలి వచ్చిన సమయంలో సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. వర్షాకాలం కావడంతో ప్రమాదాలు జరగక ముందే నివారణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ తెలిపారు.
- న్యూస్‌టుడే, చాట్రాయి